సమావేశము - VI
వాల్యూం - I
నెం. 4

వెల : రూ. 51-50
10 సెప్టెంబర్, 2020
గురువారం,
(శక సం. 1942,
భాద్రపద బ. - 8)

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

		పేజి. నెం.
1. ప్రశ్నోత్తరాలు	...	01
2. సభా సమక్షంలో ఉంచే పత్రం	...	
3. ప్రభుత్వ బిల్లులు:	**...**	**28**
a) 2020, తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల (స్థాపన మరియు క్రమబద్ధీకరణ) (సవరణ) బిల్లు.		
b) 2020, తెలంగాణ విపత్తు మరియు ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితి (ప్రత్యేక నిబంధనలు) బిల్లు.		
c) 2020, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల (పదవీ విరమణ వయస్సు క్రమబద్ధీకరణ) (సవరణ) బిల్లు.		
d) 2020, తెలంగాణ కోశ బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ (సవరణ) బిల్లు.		
4. జీరో అవర్	...	29

* * *

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి
ఉప సభాపతి	:	శ్రీ టి. పద్మారావు
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
ఉప కార్యదర్శులు	:	శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్
		శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
		శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి
సహాయ కార్యదర్శులు	:	శ్రీ ఇ. సంజీవరావు శ్రీమతి బి. ప్రమీల శ్రీమతి ఎస్. నాగమణి శ్రీ డి. శ్రీనివాసులు శ్రీ ఎమ్. రఘుమారెడ్డి శ్రీ ఎ. సుధాకర్ శ్రీ పి. శ్రీనివాస్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ కె. భాస్కర శ్రీనివాస్

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(2వ శాసన సభ)

(ఆరవ సమావేశము - నాలుగవ రోజు)

గురువారము, సెప్టెంబర్ 10, 2020

(సభ ఉ.గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్ :- గౌరవ సభ్యులకు మరొకసారి నేను జ్ఞాపకం చేస్తున్నాను. మొదటి రోజు కొవిడ్-19 పై ఏ నిబంధనలైతే పాటించాలని తమరందరికీ విజ్ఞప్తి చేశానో వాటిని తు.చ. తప్పకుండా పాటించవలసిందిగా మరొకసారి గౌరవ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. There are some announcements.

ANNOUNCEMENT

I am to announce to the House that the following Bills will be taken up for consideration and passing by the Assembly tomorrow, i.e., the 11th Day of September, 2020, and the amendments to the Bills will be received up to 04:00 P.M., today.

1. The Telangana Rights in Land And Pattadar Pass Books Bill, 2020, (L.A. Bill No: 7 of 2020)

2. The Telangana Abolition of The Posts Of Village Revenue Officers Bill, 2020, (L.A. Bill No: 8 of 2020)

3. The Telangana Municipal Laws (Amendment) Bill, 2020, (L.A. Bill No: 9 of 2020)

4. The Telangana Panchayat Raj (Amendment) Bill, 2020, (L.A. Bill No: 10 of 2020)

Now, we will take up Question hour. Question No: 354, Minister for Agriculture.

ప్రశ్న నెం. 354(7)

సర్వశ్రీ బాల్క సుమన్, గువ్వల బాలరాజు, సండ్ర వెంకట వీరయ్య. ఎమ్మెల్యేలు గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో పామాయిల్ సాగును ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, సదరు ప్రయోజనానికి అనువైన భూములను ప్రభుత్వం గుర్తించిందా?

ఇ) ఈ సంవత్సరం ఎంత భూ విస్తీర్ణంలో పామాయిల్‌ని సాగు చేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది?

ఈ) పామాయిల్ రైతులకు ఏదేని సబ్సిడీ/ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం సమకూరుస్తున్నదా?

ఉ) అయితే, ఆ వివరాలేమిటి?

వ్యవసాయ శాఖామంత్రి (శ్రీ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి):-

అ) అవునండీ

ఆ) అవునండీ

ఇ) జాతీయ ఆహార భద్రత మిషన్, ఆయిల్‌పామ్ పథకం క్రింద 2500 హెక్టార్లు/6250 ఎకరాలలో ఈ సంవత్సరం

ఆయిల్‌పామ్ సాగును చేపట్టడమువుతున్నది. ఆయిల్‌పామ్ సాగుకోసం 25 జిల్లాలలో 3.29 లక్షల హెక్టార్లు/8.14 లక్షల ఎకరాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఈ) అవునండీ

ఉ) పామాయిల్ రైతులకు సమకూర్చే సబ్సిడీ/ ప్రోత్సాహకాలపై సవివరమైన పట్టికను సభా సమక్షంలో ఉంచడమయింది.

సభా సమక్షంలో ఉంచడానికి పామాయిల్ రైతులకు సమకూరుస్తున్న సబ్సిడీ / ప్రోత్సాహకాల వివరాలను చూపే పట్టిక (శానన సభ ప్రశ్న నెం. 354కి జతపరచడమయింది).

-oOo-

ప్రస్తుతం 60:40 నిధుల సమీకరణ విధానంతో కేంద్ర ప్రతిపాదిత పథకమైన జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం)-ఆయిల్ పామ్ పథకం క్రింద ఆయిల్ పామ్ ప్రాంత విస్తరణ కార్యక్రమాన్ని అమలుచేయడమవుతున్నది. ఈ పథకం క్రింద, 4 సంవత్సరాల కాలానికి సహాయంగా ఒక్కొక్క ఎకరానికి రూ.20,800/-ల (డ్రిప్ కాకుండా) ను సమకూర్చడమయింది. ఎన్ఎఫ్ఎస్ఎం మార్గదర్శకాల ప్రకారం రైతు మొత్తం కమతాలకి సహాయాన్ని అందించడమవుతుంది.

ఎకరానికి రైతులకు సమకూర్చిన అంశం వారీ సహాయాన్ని ఈ క్రింద చూపడమయింది.

1. ప్లాంట్ మెటీరియల్ కోసం సహాయం : ఒక్కొక్క ఎకరానికి రూ.5200/-ల మొత్తం వ్యయంపై ఒక్కొక్క ఎకరానికి రూ.4800/-ల చొప్పున (ఒక్కో ఎకరానికి 57 మొక్కల చొప్పున) 93 శాతం సబ్సిడీ.

2. నిర్వహణ కోసం ఇన్‌పుట్స్ : ఎకరానికి రూ.4000/-ల యూనిట్ వ్యయంపై సంవత్సరానికి ,ఎకరానికి రూ.2000ల చొప్పున 50 శాతం సబ్సిడీ. 4 సంవత్సరాలకు ఎకరానికి రూ. 8,000/- మొత్తం సహాయాన్ని సమకూర్చడమయింది.

3. అంతర్ పంట విధానం కోసం సహాయం : ఎకరానికి రూ.4000/-ల యూనిట్ వ్యయంపై సంవత్సరానికి ఎకరానికి రూ.2000/-ల చొప్పున 50 శాతం సబ్సిడీ. 4 సంవత్సరాలకు ఎకరానికి రూ. 8,000/- మొత్తం సహాయాన్ని సమకూర్చడమయింది.

4. పిఎంకెవెస్‌పై క్రింద బిందు సేద్యం : ఎకరానికి రూ.22,000/-ల యూనిట్ వ్యయానికి గానూ ఎకరానికి రూ.10,000/-ల గరిష్ట సాయంతో రైతుల కేటగిరి ప్రాతిపదికన 80 శాతం - 100 శాతం సబ్సిడీ.

వరుస సంఖ్య	అంశం	ఎకరానికి యూనిట్ వ్యయం (రూ.లలో)	సబ్సిడీ విధానం	సహాయం ఎకరానికి (రూ.)	రైతు వాటా (రూ.)
1.	మొదటి సం॥లో నారు మొక్కలు/ ప్లాంట్ మెటీరియల్	5,200/- (57 మొక్కల కోసం ఒక్కొక్క మొక్క రూ.91/-ల చొప్పున)	యూనిట్ వ్యయం పై 93 శాతం సహాయం	4,800/-	400/-
2.	మొదటి 4 సంవత్సరాలకి తోటల నిర్వహణ	16,000/-	సంవత్సరానికి ఎకరానికి రూ.2000/-ల చొప్పున యూనిట్ వ్యయంపై 50 శాతం సహాయం	8,000/-	8,000/-
3.	మొదటి 4 సంవత్సరాలలో అంతర్ పంట కోసం సహాయం	16,000/-	సంవత్సరానికి ఒక్క ఎకరానికి రూ.2000/-ల చొప్పున యూనిట్ వ్యయంపై 50 శాతం సహాయం	8,000/-	8000/-
4.	మొదటి సం॥లో బిందు సేద్యం కోసం సహాయం	22,000/-	కేటగిరి ప్రాతిపదికన 80 శాతం - 100 శాతం	10,000/-	12,000/-
	మొత్తం	59,200/-		30,800/-	28,400/-

శ్రీ బాల్కసుమన్ :- ధన్యవాదాలు అధ్యక్షా, మంత్రిగారు సమాధానం వ్రాతపూర్వకంగా పంపించడం జరిగింది, దాన్ని నేను చూశాను. క్రూడాయిల్, ఎడిబుల్ ఆయిల్స్, పల్సెస్‌ను ఇప్పటికీ ఇంపోర్ట్ చేసుకుంటున్న దేశం మనది. మన దగ్గర వంట నూనెల వినియోగం విస్తృతంగా ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన పంటలు పండించడానికి గత ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించక ఇప్పటికీ కూడా వంట నూనెలను ఎక్కువగా ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులున్నాయి. పల్సెస్ కూడా ఇక్కడ పండించకుండా వాటిని దిగుమతి

చేసుకుంటున్నాం. మన చుట్టూ సముద్రాలున్నా క్రూడాయిల్‌ను ఇతర గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఈ మూడింటి విషయంలో పెద్ద ఎత్తున భారతదేశం విదేశీ మారకద్రవ్యాన్ని కోల్పోతోంది.

గతంలో నేను పార్లమెంటు సభ్యునిగా ఈ అంశంపై కొంత పరిశోధన చేశాను. ఖచ్చితంగా భారతదేశం ఈ విషయంలో సెల్ఫ్ రిలయంట్ కావలసిన అవసరం ఉంది. ముఖ్యంగా తెలంగాణ కొత్తగా ఏర్పాటైన రాష్ట్రం, గౌరవ ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో దేశానికి అన్ని రంగాలలో రోల్ మోడల్‌గా ఉన్న రాష్ట్రం. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్న దరిమలా ఆ వంట నూనెల ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా తెలంగాణ రాష్ట్రం నుంచి పెంచి, భారతదేశ ప్రగతిలో తెలంగాణ తన వంతు పాత్ర పోషించవలసిన అవసరముందని గౌరవ ముఖ్యమంత్రి గారు, వ్యవసాయ శాఖామంత్రి గారు గుర్తించి దీనికి సంబంధించిన పంటలను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నారు. దానిలో భాగంగా తెలంగాణలో పామాయిల్ పంట సాగును ప్రోత్సహించాలనే నిర్ణయం రాష్ట్రప్రభుత్వం తీసుకుంది. ఇప్పటికే 25 జిల్లాలలో దగ్గర దగ్గర 8 లక్షల ఎకరాలలో పామాయిల్ పంటను పండించాలని వ్యవసాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా మంత్రిగారిని అడుగుతున్న ప్రశ్న ఏమంటే, ఇప్పటికే ఈ సంవత్సరం ఒక సీజన్ అయిపోయింది, రెండు మూడు నెలలు గడచిపోయింది. తెలంగాణలో అప్పారావుపేట, అశ్వారావు పేటలలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రెండు ఫ్యాక్టరీలున్నాయి. రేపు 8 లక్షల ఎకరాలలో పామాయిల్ పంటను సాగు చేయాలని రైతులను ప్రోత్సహిస్తున్నపుడు ఈ రెండు ఫ్యాక్టరీలు సరిపోవు కాబట్టి దీంట్లో ప్రైవేటు ప్లేయర్స్‌ను ఎంకరేజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. ఇతర పరిశ్రమలను ఏవిధంగానైతే ప్రోత్సహిస్తున్నారో, అదే విధంగా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్‌ను ప్రోత్సహించే దాంట్లో భాగంగా జిల్లాల వారీగా జోన్లను ప్రకటించి, ప్రైవేట్ ప్లేయర్స్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ ఇచ్చి చాలా రోజులైంది. ఆయా ప్రైవేటు కంపెనీల వాళ్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. అయితే ఇంకా జోన్ల అలాట్‌మెంటు జరగడం లేదు. మా ప్రాంత రైతాంగమంతా ఎదురు చూస్తున్నారు. గడచిన ఒకటిన్నర సంవత్సరం కాలంగా చెన్నూరు నియోజకవర్గంలో మా రైతులను మోటివేట్ చేసి ఈ పామాయిల్ పంటను విస్తారంగా పండించాలని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటి వరకు మాకు ఒక జోన్‌ని, ఒక ఫ్యాక్టరీని ప్రకటించలేదు. 25 జిల్లాలలో ఏయే భూములు ఈ పంటకు అనుకూలంగా ఉన్నాయో వాటి విషయంలో జోన్లు డిక్లేర్ చేసి, ఏయే ప్రైవేటు సంస్థలకు ఇస్తారో ఇవ్వండి. ఆవిధంగా ఇస్తే వాళ్లు వెంటనే వచ్చి నర్సరీలు పెట్టుకుంటారు. అక్కడ రైతాంగాన్ని ప్రోత్సహిస్తారు. ఇంకా కొన్ని అదనపు ప్రోత్సాహకాలు అందించి రైతులను ముందుకు తీసుకురావడానికి ఆస్కారం ఉంటుంది. ఈ ప్రాసెస్ కొంత డిలే కావడం వల్ల ఒక సీజన్ పోయింది. తర్వాతి సీజన్ వేసంగి లోపలైనా ప్రాసెస్ పూర్తయితే బాగుంటుంది.

విత్తనాలు ఇక్కడ దొరకవు. కోస్టారికా లాంటి బయటి దేశాల నుంచి తెచ్చుకోవలసిన అవసరం ఉంది. మీరు కంపెనీలను ఆల్‌రెడీ ఇంటర్వ్యూస్ చేశారు, వాళ్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు కాబట్టి జిల్లాల వారీగా జోన్లను ప్రకటించి ఏయే జిల్లాలు ఏయే కంపెనీలకు ఇస్తారో నిర్ణయం తీసుకోండి. మీరు ఆవిధంగా నిర్ణయం తీసుకుంటే, ఈ విషయంలో యాక్టివ్‌గా పని చేస్తున్న ఎమ్మెల్యేలు ఆ కంపెనీలతో కలిసి రైతులను ప్రోత్సహించే విషయంలో ముందుకు పోవడానికి ఆస్కారం ఉంటుంది. ఆ నిర్ణయం ఎప్పటిలోగా తీసుకుంటారో చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

ఫీల్డ్‌లో వస్తున్న కొన్ని ఇబ్బందులను చూస్తున్నాను. ముఖ్యంగా డ్రిప్ ఇరిగేషన్ విషయంలో ఇబ్బంది వస్తోంది. అధ్యక్షా, గతంలో తమరు కూడా వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం లేకుంటే ఈ పామాయిల్ పంట సాగు చేయడం కష్టం. గతంలో మనపై ఒక కుట్ర జరిగింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమైక్య పాలకులు కుట్ర చేశారు. తెలంగాణ భూములు, తెలంగాణ

వాతావరణం ఈ పంటకు అనుకూలం కాదని ఒక విష ప్రచారం చేసి ఈ పంట పండించకుండా, రైతుల గురించి ఆలోచన చేయకుండా కుట్ర చేశారు. మన రాష్ట్రం వచ్చిన తర్వాత దీంట్లో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే ఆలోచనతో చాలా మంది ఎమ్మెల్యేలం మా నియోజకవర్గాలలో పని చేసుకుంటూ పోతున్నాం. ఫీల్డ్ లెవల్‌లో వస్తున్న ఇబ్బందులు ప్రధానంగా రెండు ఉన్నాయి. ఒకటి – మొక్కల పంపిణీ, రెండు – డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడం. డ్రిప్ ఇరిగేషన్‌కి సంబంధించి కొంత డిలే జరుగుతోంది. మా చెన్నూరు నియోజకవర్గంలో దగ్గర దగ్గర 409 ఎకరాలకు రైతులు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కోసం డిడిలు కట్టారు. అయితే వంద ఎకరాల వరకు మాత్రమే అది క్లియర్ అయింది. 309 ఎకరాలకు సంబంధించి డ్రిప్ ఇరిగేషన్ క్లియర్ కాలేదు. ఎవరెవరైతే డిడిలు కట్టారో వాటి ప్రాసెస్‌ను కంప్లీట్ చేస్తే ఇంకా ఉత్సాహంగా రైతులు ముందుకు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఈ డ్రిప్ ఇరిగేషన్ విషయంలో కొంత చొరవ తీసుకొని, నేరుగా వ్యవసాయ శాఖామంత్రి గారే ఇంటర్వీన్ అయి, ప్రతి వారం దీని విషయంలో కొంత మానీటర్ చేయాలని తమరి ద్వారా కోరుతున్నాను. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ఇదొక కొత్త పంట, ఇదొక కమర్షియల్ క్రాప్. ఒక కొత్త పంటను మన రాష్ట్రంలో తీసుకొచ్చే క్రమంలో మన రైతాంగాన్ని ఉద్యమ స్ఫూర్తితో చైత్యన్యం చేయవలసిన అవసరం ఉంటుంది కాబట్టి ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమరి ద్వారా గౌరవ వ్యవసాయ శాఖామంత్రిగారిని కోరుతున్నాను.

10.10 ఉ. ఏయే జిల్లాలోనైతే ఈ పామాయిల్ పంటలకు భూములు అనుకూలంగా ఉన్నాయని, రీ-అసెస్‌మెంట్ కమిటీ కేంద్ర ప్రభుత్వం రిపోర్టు వచ్చిందో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఇదే శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాలులో ఏదో ఒక రోజు గౌరవ మంత్రిగారు సమావేశాన్ని ఏర్పాటుచేసి మాకు ఇంకా సవివరమైన విషయాలను పామాయిల్ పంటకు సంబంధించి చెబితే మేం వెళ్లి మా నియోజకవర్గ రైతులకు చెప్పుకోవడానికి ఆస్కారముంటుంది. కాబట్టి ఆ దిశగా చర్యలు చేపడితే బాగుంటుందని తమరి ద్వారా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గువ్వల బాలరాజు:- అధ్యక్షా, మా మిత్రుడు బాల్క సుమన్‌గారు ప్రశ్నలోనే మొత్తం కూలంకశంగా అర్థమయ్యేటట్లు మాట్లాడటం జరిగింది. పామాయల్ పంట రైతులకు లాభసాటిగా ఉంటుందా లేదా అనేది చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను. పామాయిల్ కంపెనీలు నేరుగా రైతుల దగ్గరికి వచ్చి కొనుగోలు చేసే వెసులుబాటు ఏమైనా కల్పిస్తారా అనే విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాను. పామాయిల్ సాగుకు మన రాష్ట్రంలో ఏయే జిల్లాలలో వాతావరణం అనుకూలంగా ఉంటుందనేది రిపోర్టు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్రంలో పామాయిల్ సాగుకు అనుకూలమైన ప్రాంతాల గురించి రైతులకు చైతన్యం కల్పించే విధంగా విస్తృతమైన క్యాంపెయిన్ నిర్వహిస్తే కూడా బాగుంటుందని ఈ సందర్భంగా నేను కోరుతున్నాను. అదే విధంగా ఈ సిస్టంలోకి రైతులను ముందుకు తీసుకరావాలంటే మన దళిత, పేద రైతులకు సబ్సిడీ ఇచ్చే విషయం గురించి ఏమైనా ప్రభుత్వం ఆలోచనా చేస్తుందా అనేది చెప్పాలని కోరుతున్నాను. అదే విధంగా పామాయిల్ సాగుకు మన రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందించే విధంగా మరీ ముఖ్యంగా మా జిల్లా నుంచి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి గారు ఉన్నందున మా జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం అచ్చంపేట, ముఖ్యమంత్రి గారు స్వయానా రైతు అయినందున వారు వ్యవసాయం మీద ప్రత్యేక దృష్టిపెట్టిన కారణంగా యువకులు, విద్యార్థులతోబాటు ఐ.టిలో పనిచేస్తున్న యూత్ కూడా ఇప్పుడు వ్యవసాయ రంగంలోకి వస్తున్నారు, వాళ్లు ఇన్నోవేటివ్ థాట్స్‌తో ఉన్నందున వారి విషయంలో కూడా విస్తృతమైన క్యాంపెయిన్ కింద మిత్రులు సుమన్ గారు కోరినట్లుగా హైదరాబాదులో మంత్రిగారు ఒక వేదికను ఏర్పాటుచేసి ఎడ్యుకేటెడ్ యూత్‌ను కూడా దీంట్లోకి తీసుకొచ్చి అవేర్‌నెస్ కల్పిస్తే బాగుంటుంది. ప్రత్యేకంగా అచ్చంపేట నియోజకవర్గం

ఇప్పటికి కూడా కొంత సాగునీరు రాక ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి అచ్చంపేట నియోజకవర్గంలో ఉన్న రైతులకు ట్రైనింగ్ కల్పించే విధంగా అవసరమనుకుంటే ఈ కార్యక్రమాన్ని నా నియోజకవర్గంలో అవేర్‌నెస్ కార్యక్రమాన్ని ఇనిషియేట్ చేసినట్లైతే కావలసిన సహకారాలన్నింటిని మేం అందించగల్గుతాము. కాబట్టి ఒక విస్తృతమైన చర్చ అక్కడ జరిగే విధంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ నండ్ర వెంకట వీరయ్య :- అధ్యక్షా, ప్రపంచ మార్కెట్లో పామాయిల్‌కు ఉన్న ధర మరే పంటకు లేదు. నిన్నటి ధర 10వేలా 903 రూపాయలుగా నమోదైంది. అంటే పామాయిల్ పంట అత్యంత లాభసాటిది. ఇది అన్ని రకాల వాతావరణాలను తట్టుకునే పంట. కానీ దీనికి కావలసింది సమృద్ధిగా నీళ్లు. అందువల్ల మన తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన సందర్భంగా రేపు సీతారామ ప్రాజెక్టు గానీ లేదంటే మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులు గానీ పూర్తవుతున్న సందర్భంగా ఎక్కువగా సాగుకు అవకాశమున్న పంట పామాయిల్ పంట. ఎలాంటి వాతావరణం ఉన్నా తట్టుకునే పంట కాబట్టి దీనిని ప్రోత్సహించే విధంగా మన వ్యవసాయ శాఖ ద్వారానే నర్సరీలు పెంచే అవకాశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. రైతుల డిమాండు మేరకు మనం మొక్కలు ఇవ్వలేకపోతున్నాము. త్రిబుల్ ఎఫ్ అనే ఒక కంపెనీ నుంచి మనం మొక్కలు కొనుగోలు చేస్తున్నాము. కానీ నాణ్యత లేదనేది రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కాబట్టి మన హార్టికల్చర్ డిపార్టుమెంటు ద్వారానే టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న అధికారులను నియమించి ఈ నర్సరీల పర్యవేక్షణ చేసి పెంపొందించే విధంగా చూడాలి. అదే విధంగా మనం తెలంగాణలో రెండు ప్రభుత్వ రంగాలున్నాయి. అవి ఒక అశ్వారావుపేట, రెండవది అప్పారావుపేట. ఆంధ్ర ప్రభుత్వంలో ఏడు ప్రైవేటు రంగాలున్నాయి. అక్కడ ప్రభుత్వం ఒక జి.ఓ ఇస్తూ తెలంగాణలో పామాయిల్‌కు ప్రభుత్వం ఏ ధరనైతే నిర్ణయిస్తుందో ఆ ధరనే ప్రైవేటు ఫ్యాక్టరీలు నిర్ణయించాలని ఇచ్చినందున 2016-17, 2017లో 18.94 రికవరీ శాతం ఉంటే ఈరోజు 18.2కు పడగొట్టారు. దీనివలన మన తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతున్నది. మన మీద ఆధారపడి ప్రైవేటు ఫ్యాక్టరీలు ఏదైతే ఆ ప్రభుత్వం ఇచ్చిందో ఆ రాష్ట్ర రైతులకు కూడా నష్టం జరిగే అవకాశమున్నది. తమరు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తమరితోబాటు మేం కూడా అశ్వారావుపేటకు వచ్చాము. ఆరోజు కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడ్డారని మీరు సస్పెండ్ చేసిన సంగతి మాకు తెలుసు. అందువల్ల అసలు ఈ రికవరీ శాతం ఎందుకు పడిపోతుందో తగు నిపుణుల కమిటీ వేయాల్సిందిగా గౌరవ మంత్రిగారికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రైవేటు ఫ్యాక్టరీలు మన ఫ్యాక్టరీల మీద ఎప్పుడూ కన్నేసి అక్కడున్న ప్రభుత్వం ఇక్కడున్న ప్రభుత్వ రంగంలో కరెక్టుగా నిర్ణయిస్తారు కాబట్టి రైతులకు న్యాయం జరగాలని ఇచ్చిన సందర్భంగా మనం ఇక్కడ రికవరీ శాతం పడగొడితే ఒక టన్నుకు రూ.1500/- పడిపోయే ప్రమాదమున్నది. కాబట్టి దీనిమీద వెంటనే ఎంక్వైరీ చేయాలి.

రెండవది మీరు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువ ధర ఉన్నప్పుడు తీసుకోలేదు. మన దగ్గర ఎక్కువ ధర ఉన్నప్పుడు ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చాయి. అప్పుడు మనం చెక్‌పోస్టులు పెట్టించాము. కానీ ఇప్పుడు గ్రేడింగ్ సరిగా పెట్టకపోవడం వలన రికవరీ శాతం పడిపోతున్నదని మా దగ్గర ఆందోళన చెందుతున్నారు. అందువల్ల అసలు ఆంధ్ర ప్రాంతం నుంచి ఎందుకు తీసుకొస్తున్నారు? దానికి కారణమేంటి? గతంలో మనం నిషేధించాము. కాబట్టి దాని మీద కూడా మంత్రిగారు సవివరమైన సమాధానం ఇవ్వాలని కోరుతున్నాను. ఇది నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసే వ్యవస్థ. మధ్య దళారీ వ్యవస్థ లేదు. కానీ మన ట్రేడింగు లైసెన్సు కూడా కొంత మందికి అనగా ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన వారికి తెలంగాణ ప్రాంతానికి చెందిన రైతుల పేర్ల మీద ఇచ్చారు. ఈ విధంగా ఎందుకు ఇవ్వాల్సి వస్తుందనేది కూడా చెప్పాలి. అదే విధంగా ఫ్యాక్టరీల పరిధిలో జోనల్ కమిటీలను రైతులతో వేయాలి. మా ప్రాంతమైన సత్తుపల్లి, అశ్వారావుపేట ఎక్కువగా

ఉన్నప్పటికీ మాకు తెలియకుండానే కమిటీలు వేశారు, ఈ విషయం మంత్రిగారి దృష్టిలో కూడా ఉంది. అదే విధంగా జోనల్ కమిటీ పామాయిల్ కంపెనీ యాక్టులో ఇద్దరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా ఉండి దానికి సంబంధించిన హార్టికల్చర్ ఎండీగారు వీరందరూ ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఒక జోనల్ కమిటీ ఉండాలని పామాయిల్ యాక్టులోనే పెట్టాము. ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఇప్పటివరకు అనుభవం కలిగిన మా ప్రాంతం గానీ లేదంటే ఇప్పుడు కొత్తగావస్తున్న ప్రాంతానికిసంధించిన ఎమ్మెల్యేలతో జోనల్ కమిటీలు వేసి ఆ ఫ్యాక్టరీలో మొక్కలు కొనాలన్నా, రికవరీ పడిపోతున్నా ఆ ఫ్యాక్టరీకి సంబంధించిన లావాదేవీలను పర్యవేక్షించడం కోసం యాక్టులో ఉన్న ప్రావిజన్‌ను ఎందుకు అమలు చేయడం లేదనేది తెలియజేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి :- అధ్యక్షా, ప్రశ్నకు మంత్రిగారు రాత పూర్వకంగా ఇచ్చిన సమాధానానికి అదనంగా నేను అడిగేదేమిటంటే ఈరోజు జరుగుతున్న మార్పులలో భాగంగా పామాయిల్ పంట వేయడం వలన తెలంగాణ రాష్ట్రంలో ప్యాడీ మీద గానీ కాటన్ మీద గానీ ప్రెజర్ తగ్గే అవకాశముంటుంది. మనం పెట్టే మొక్కలు కోస్తారిక నుంచి సీడ్ తీసుకొచ్చి దాని ద్వారా మొక్కలు డెవలప్ చేసి ఇస్తున్నారు. దానికి ఆల్టర్‌నేటివ్‌గా ఇప్పటికే వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులలో భాగంగా టిష్యూ కల్చర్ పద్ధతి ద్వారా మొక్కలను డెవలప్ చేసి ఇచ్చినట్లైతే ఇంకా దిగుబడి ఎక్కువ వచ్చి తక్కువ సమయంలోనే దగుబడి వచ్చే అవకాశముంటుంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ టిష్యూ కల్చర్‌ను డెవలప్‌చేసే అవకాశమున్నదా అనేది పరిశీలించాలని కోరుతున్నాను. ఈ మొక్కలు పెట్టిన తరువాత ఒకసంవత్సరం తరువాత ప్లాంటేషన్ చేసే అవకాశముంటుంది కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వీలైనంత తొందరలో నిర్ణయం తీసుకోవాలి.

అదే విధంగా రైతులలో పామాయిల్ పంటకు సంబంధించి ఒక రకమైన అనుమానాలు ఉన్నాయి. వీటికి ఎన్ని నీళ్లు అవసరం పడతాయి, ఒక చెట్టు ఎన్ని నీళ్లు తాగుతుందనే అనుమానం ఉన్నందున సాంకేతికంగా దీనికి కూడా మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను. ఈ పామాయిల్ పంట ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయడంతోబాటు ఈరోజు చాలా మంది నిరుద్యోగులకు ఉపాధి దొరికే అవకాశమున్నది. దీనితోబాటుగా ఇదే జాతికి చెందిన కర్జూర పంట రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో చాలా పెద్ద మొత్తంలో సాగు చేస్తున్నారు. మన ప్రాంతంలో కూడా 45 డిగ్రీల సెల్సియస్ దాటితే కర్జూర పంట పెట్టే అవకాశముంటుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి తెలంగాణ ప్రాంతంలో ఉన్న 45 డిగ్రీల టెంపరేచర్‌కు తగ్గట్లుగా కర్జూర గానీ పామాయిల్ గానీ ఈత జాతికి సంబంధించినవైనందున వీటి విషయంలో ప్రభుత్వం ముందుకొస్తే చాలా మందికి అవకాశాలు దొరుకడమే కాకుండా రైతులకు కూడా మేలు జరుగుతుందని ఒక సలహా చెబుతున్నాను.

10.20 ఉ. శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి :- అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ బాల్క సుమన్, శ్రీ గువ్వల బాలరాజు, శ్రీ సంద్ర వెంకటవీరయ్య, శ్రీ రవణా రెడ్డి గారు అడిగినటువంటి ప్రశ్నలకు మరియు సభలో ఉన్నటువంటి ఇతర సభ్యుల సమాచార నిమిత్తం ఉపయుక్తంగా ఉంటుందని కొంచెం వివరణాత్మకంగా తమరి అనుమతితో జవాబు చెబుతాను. ఎందుకంటే, మన దేశం కూడా ప్రధానంగా వ్యవసాయక దేశం, అందులో ప్రత్యేకంగా మన రాష్ట్రం వ్యవసాయక ప్రధాన రాష్ట్రం. పైగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ రంగానికి ఇస్తున్నంత ప్రాధాన్యత, కేటాయిస్తున్నటువంటి నిధులు, ఈ రంగం మీద పెట్టినంత దృష్టి బహుశా దేశంలో ఇంకా ఏ రాష్ట్రం కూడా దృష్టి పెట్టినట్లు మనకు దరిదాపుల్లో లేదు.

అందుకని, ఈ రంగం ద్వారా వచ్చే ఉపాధి అవకాశాలు, స్థూల ఆదాయం చూస్తే తప్పకుండా ఉజ్వలమైన భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రానికి ఉందనేది ఇప్పటికే రుజువు చేస్తున్నాయి. ఈ ఏడు నిన్నటి దాకా వచ్చిన వివరాల

ప్రకారంగా మన రాష్ట్రంలో సాగైనటువంటి విస్తీర్ణం ఉద్యాన పంటలతో కలుపుకొని 1.41లక్షల ఎకరాలల్లో పంటలు సాగు అయ్యాయి. నిన్న శాసనపరిషత్తులో కూడా చెప్పడం జరిగింది. ఇంకా నాగార్జున సాగర్ క్రింద వరి, ఇటు కృష్ణా నది ఎగువన ఉమ్మడి పాలమూరు జిల్లా చివరిలో ఇంకా వరినాట్లు నడుస్తున్నాయి. అవి ఇంకా ఐదారు రోజుల వరకు నడుస్తాయి. అవి కూడా లెక్కల్లోకి వస్తే లక్షా ఎకరాలకు పైబడే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఏటేటికి భవిష్యత్తులో ఇంకా ఈ సాగు విస్తీర్ణం పెరుగుతుంది. మనం చూస్తే పోయిన యాసంగిలో ఒక్కవరిలో వచ్చిన ఉత్పత్తే భారత ఆహార సంస్థ సేకరించినటువంటి మొత్తం ధాన్యంలో 55శాతం వరిధాన్యం ఒక్క తెలంగాణ రాష్ట్రం నుండే సేకరించడం అనేడిది గననీయంగా తెలంగాణ రాష్ట్రంలో వస్తున్నటువంటి ఉత్పత్తులకు ప్రత్యక్ష ఉదాహరణ.

కాబట్టి, రాబోయే రోజుల్లో ఇంకా ఈ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో, ఉత్పత్తులు పెరగడం శుభసూచకం, అవశ్యకం. దానికోసమే మనం పని చేస్తున్నాం. ఇది రాష్ట్ర ఆదాయానికే కాదు, దేశ ఆదాయానికి కూడా మనం తోడ్పడేటువంటి వ్యవహారం. అయితే ఇదే సందర్భంలో పంటల యొక్క మార్పిడి జరగడం, డైవర్షిఫికేషన్ జరగాలే, విధిగా పంటల మార్పిడి జరగవలసి ఉంటున్న నేలల్లో ఒకే పంటల్ని చిరకాలం వేయడానికి అవకాశం లేదు. పంటల మార్పిడి జరగకపోతే ఉత్పత్తి రాకపోవడమే గాక రోగాలు వస్తాయి, దిగుబడి తగ్గిపోతుంది. దీనికి తోడుగా మార్కెట్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని పంటల్ని వేయవలసి ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొనే వ్యవసాయంలో నియంత్రిత సాగుకు దేశంలో మొదటిసారి గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఒక నూతన సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఈ వానాకాలంలో మనం దానిని ప్రారంభించాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి ఉత్పత్తులను మనం దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే సర్ప్లస్‌గా మనకు అందుబాటులో ఉన్న మక్క 300 మిలియన్ టన్నులు ఉంది. కాబట్టి, ఈ వానాకాలంలో రైతులు మక్క వేస్తే వచ్చే ఉత్పత్తిని కనీస మద్దతు ధర అయిన రూ.1760/-లకు అమ్ముకునే సాధ్యం కాదు. దానిని దృష్టిలో పెట్టుకొని పంటలు వేయాలనే ఆలోచనతో వచ్చిన నియంత్రిత సాగు ద్వారా ఈరోజు రైతులు మక్కలు వేయవద్దని చెబితే, రైతులు మక్కలు వేయలేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు తగ్గించుకొని ఇటు కందులకు, అటు వరికి, పత్తికి మారిపోయారు. అందువల్ల మనదగ్గర ఏటికేటికి పెరుగుతున్న ఆయకట్టు విస్తీర్ణాన్ని, సాగును దృష్టిలో పెట్టుకొని నూతన పంటలను ప్రోత్సహించడం తెలంగాణ వ్యవసాయక ఆవశ్యకత.

పండించినటువంటి పంటకు మంచి మార్కెట్ ధర రావాలి, ఉపాధి అవకాశాలు మెండుగా పెరగాలనే కోణంలో తీసుకున్నప్పుడు భిన్నమైన పంటలవైపు సహజంగానే వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టిమళ్లుతుంది, వారు వ్యవసాయ శాఖకు సూచనలు చేస్తారు. భారతదేశంలో నూనెగింజల ఉత్పత్తి అనేది గణనీయంగా పడిపోయింది. భారతదేశంలో ఉన్నటువంటి మొత్తం దాదాపు 135కోట్ల జనాభా అవసరాలకు ప్రత్యేకంగా ప్రతి ఏటా దాదాపు 21 మిలియన్ టన్నుల వంట నూనెలు వాడుతున్నాం. రాబోయే రోజుల్లో ఈ వాడకం ఇంకా పెరుగుతుంది. ఈ మోతాదుకు సరిపడా వంట నూనెల ఉత్పత్తి మన దేశంలో లేదు.

అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రమాదాన్ని గుర్తించి, విదేశాల నుండి వంట నూనెల్ని వరసపెట్టి దిగుమతి చేసుకోవడం మూలంగా ఈ దేశం యొక్క విదేశీ మారక ద్రవ్యాన్ని మనం కోల్పోవలసి వస్తుంది, అదనంగా మనం నష్టపోవలసి వస్తుంది. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడి ఈ వంట నూనెలకు సంబంధించిన పంటల్ని ప్రోత్సహించాలనే నిర్ణయానికి రావడం జరిగింది. ఈ ఆలోచన దాదాపు ఐదారేండ్ల నుండే ఉంది. ఇప్పుడు ఇంకా ముమ్మరంగా చేస్తున్నారు. ఇందులో భాగంగానే వంట నూనెల కోసం ఈరోజు భారతదేశం విదేశీ మారక ద్రవ్యం రూపంలో వెచ్చిస్తున్నటువంటి డబ్బులు సాలీనా రూ.79,000కోట్లు. అందులో ఇండోనేషియా, మలేషియా నుండి తెప్పించుకుంటున్న ఒక్క పామ్‌ఆయిల్ మీదనే సాలీనా

రూ.40,000 కోట్ల పైచిలుకు కేంద్ర ప్రభుత్వం కడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని మొత్తం భారతదేశంలో దాదాపు 18లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్‌ను దేశ వ్యాప్తంగా సాగుచేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొని, దానికి అనువైన ప్రోత్సాహకాలు ఇవ్వాలనుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని సాగును విస్తరించాలని నిర్ణయం తీసుకోకముందే, మన రాష్ట్రంలోని ఉద్యానవన శాఖ, మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చినటువంటి ప్రతిపాదనల ద్వారా తెలంగాణలో ఆయిల్‌ఫాం సాగును విస్తరించాలని చెప్పి తమరు మంత్రిగా ఉన్న రోజుల్లోనే ఈ ఆలోచన ప్రారంభమై గత ఏడాది కాలంగా దీనిమీద ముమ్మరమైనటువంటి చర్యల్ని స్వీకరించడం జరిగింది. అందులో భాగంగా మొదటి సంవత్సరం పైలెట్ ప్రాజెక్టు క్రింద 6,000 పైచిలుకు ఎకరాల్లో ఇప్పుడు ప్లాంటేషన్ నడుస్తోంది. ఇది కేవలం నావు మాత్రమే, రైతులకు అవగాహన కల్పించాలని, ఇది ఒక కొత్త పంట కాబట్టి, దీనిని పరిచయం చేయాలని తీసుకోవడం జరిగింది.

సభ్యులు బాల్క సుమన్ గారు ఇంతకుముందు చెప్పినట్లు, ఈ పంట తెలంగాణ ప్రాంతంలో ఏదో పండదన్నట్లు, ఈ వాతావరణమే సరిపోదన్నట్లు ఒక రకమైన అపోహను కల్పించిన కారణంగా తెలంగాణ రైతాంగం గతంలో ఆసక్తిని చూపలేదు. ఈసాగు ఒక్క ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోనే ఉంది, కొద్దిపాటి సూర్యాపేట జిల్లాలో ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నియమించినటువంటి నిపుణుల కమిటీ ఏదైతే ఉన్నదో, ఆ కమిటీ దేశ వ్యాప్తంగా పర్యటనలు చేసి దేశం మొత్తం మీద ఏ, ఏ ప్రాంతాల్లో ఈ ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైనటువంటి నేలలు ఎక్కడున్నాయో గుర్తించి నివేదిక ఇవ్వడం జరిగింది. ఆ నివేదిక ప్రకారంగా తెలంగాణ ప్రాంతాల్లో 25 జిల్లాలు యథాతథంగా ఈరోజుకు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని వారు తేల్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చే ముందు సిద్దిపేట జిల్లాను అందులో కలపలేదు. స్వయంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రాతినిధ్యం వహించే జిల్లా, అక్కడ నీళ్లు లేవని, సాగుకు యోగ్యం కాదని మీరు రిపోర్టు ఇవ్వడం బావ్యం కాదని, అక్కడ కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్ట్‌లు వచ్చాయని, ఆ ప్రాంతాల్లో నీటికి కొదవ లేదని పరిశీలన చేయండని కేంద్ర ప్రభుత్వానికి మళ్లీ మేము లేఖ వ్రాస్తే దానిని వారు పరిగణలోకి తీసుకొని సిద్దపేట జిల్లాను కూడా ఆమోదించి ఇప్పుడు రాష్ట్రంలో మొత్తం 25 జిల్లాలు ఆయిల్‌ఫాం సాగుకు అనుకూలమని చెప్పి కేంద్రం వారు మండలాలతోపాటు, ప్రాంతాలతోపాటు రిపోర్టు ఇవ్వడం జరిగింది.

ఈ సాగు చేపట్టడం మూలంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి సాగు కోసం ఇచ్చేటువంటి సౌలభ్యం ఏదైతే ఉందో అవి నాలుగు రకాలున్నాయి. ఉదాహరణకు ప్లాంట్ మెటీరియల్ మొక్కధరలో 96 శాతం సబ్సిడీ మీద రైతుకు మొక్క చేరుతుంది, ఇది వన్‌టైం సబ్సిడీ. అదేవిధంగా మెయింటనెన్స్ కోసం ఇన్‌పుట్ సబ్సిడీ అంటాం. ఇది నాలుగు సంవత్సరాల వరకు ఇస్తారు. ఎకరానికి సంవత్సరం పొడుగునా రూ.4,000/- చొప్పున ఇస్తారు. ఎందుకంటే గౌరవ సభ్యులు గువ్వల బాలరాజు గారు ప్రశ్నిస్తూ, ఇందులో ఏ, ఏ సదుపాయాలు ఉంటాయో అవి కూడా చెప్పాలని కోరారు. అందుకనే నేను ఇందులో వివరాలకు వెళ్లాల్సి వస్తుంది. అదేవిధంగా ఈ పంట నాలుగో ఏట తరువాత వస్తుంది. నాలుగో ఏట తరువాత పంట వచ్చేలోపల ఇందులో అంతర్ పంటలు తీసుకొనే అవకాశం ఉంటుంది. కాబట్టి, ఈ అంతర్ పంటల కోసం కూడా ఎకరానికి సంవత్సరానికి రూ.4,000/- ఖర్చు అవుతుంది, అందులో రూ.2,000/- సబ్సిడీ ఉంది. అదేవిధంగా బిందు సేద్యం కోసం ఒక ఎకరాకు యూనిట్‌కి రూ.22,000/- ఖర్చు అవుతుంది, అందులో రైతుకు రూ.10,000/- ఇవ్వడం జరుగుతుంది. ఇట్లా ఒక ఎకరం మీద మొత్తం ఖర్చు నాలుగు ఏళ్ల వరకు, మొక్కను పెట్టి, సంరక్షించి, అంతర్ పంట వేసి, ప్రధాన పంటను మనం చేతికి తీసుకునే వరకు ప్రభుత్వం నుండి రైతుకు సబ్సిడీ రూపంలో వచ్చేటువంటిది రూ.30,800/-, రైతుకు అయ్యేటువంటి ఖర్చు రూ.28,400/-.

ఒకసారి పంట సాగు అయిందంటే, buy back guarantee ఉన్నటువంటి పంట భారతదేశంలో ఇది ఒకటే. కొనేటువంటి పంట వారు, రవాణా ఖర్చులతోపాటు నీ పంటను నేనే కొంటానని రైతు దగ్గర ముందస్తుగానే అగ్రిమెంట్ చేసుకుంటారు. ఇందాక సభ్యులు వెంకట వీరయ్య గారు చెప్పినట్లు ఇవాల్టి రేటు రూ.10,800/- ఉంది.

10.30 ఉ. ఖర్చులు పోను సాలుకు లక్ష, లక్షా ఇరవై వేల రూపాయల వరకు ఒక ఎకరా ఆయిల్ పామ్ సాగుమీద రైతుకు మిగులుతుంది. ఇది ఇవ్వాళ కొత్తగా నేను చెబుతున్న విషయం కాదు. 25 సంవత్సరాల నుండి సాగుచేస్తున్న రైతుల అభిప్రాయం ఇది. గౌరవ సభ్యులు బాల్క సుమన్‌గారు, నేను, మరికొందరు శాసనసభ్యులు కలిసి దక్షిణ మరియు ఉత్తర తెలంగాణ ప్రాంతాలు కలిపి నాలుగైదు వేలమంది రైతులను కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, సూర్యాపేట వంటి చోట్ల, ఎక్కడైతే ఆయిల్‌పామ్ సాగు చేయబడుతున్నదో ఆ తోటలను చూసి, రైతుల అనుభవాలను విని, ప్రత్యక్షంగా అవగాహన చేసుకుంటే ఉపయుక్తంగా ఉంటుందని రైతులను అక్కడికి పంపడం జరిగింది. అనేక కార్యక్రమాలను కూడా నిర్వహించాము. గౌరవ పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులతో కూడా సమావేశాలు నిర్వహించాము. చాలా మంది హాజరైనారు.

కేంద్ర ప్రభుత్వం వేసిన రీ-అసెస్‌మెంటు కమిటి ఈ వేసవిలో తెలంగాణలో రెండు పర్యాయాలు పర్యటించింది. వారు ఏమి చెప్పారంటే గతంలో 1992లో ఒకసారి అసెస్‌మెంటు జరిగింది. ఆ తరువాత మళ్లీ 2000, 2002, 2004వ సంవత్సరాల్లో అసెస్‌మెంట్లు జరిగాయి. ఈ కమిటీ సభ్యులు చెప్పింది ఏమిటంటే తెలంగాణలో ఈ పరిస్థితులు చూసి మేమే ఆశ్చర్యపోతున్నాము. దేశంలోనే ఎక్కడాలేని విధంగా చాలా అద్భుతమైన రీతిలో ఆయిల్‌పామ్ ఇక్కడ జరుగుతున్నది. మేము చాలా సంతోషంగా ఉన్నామని వారు చెప్పడం జరిగింది. ఈ రోజు 25 జిల్లాల్లో 8.14 లక్షల ఎకరాల్లో సాగుకు మనకు అనుమతిచ్చారు. రేపు భవిష్యత్తులో మనం ఎంత అడిగితే అంత ఇవ్వడానికి సుముఖం అని కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఇది చాలా అద్భుతమైనటువంటి పథకం. దీని ద్వారా పంట మార్పిడి జరుగుతుంది, నూతన పంట వస్తుంది. రైతుకు స్థిర ఆదాయం ఉంటుంది. Buy back policy కూడా ఉంటుంది. కోతుల బెడద, రాళ్లవాన బెడద, అడవి పందులతో ఇబ్బంది వంటివి ఉండవు. గాలివానల వంటి ఇతర ఏ ఇబ్బందులు కూడా ఉండవు. సురక్షితంగా రైతుకు ఆదాయం కల్పించే వనరులున్నటువంటి పంట ఈ ఆయిల్ పామ్.

దీని అమలుకు ఒక విధానం ఉంది. కేంద్ర ఆయిల్ పామ్ చట్టం ప్రకారంగా ఈ ఆయిల్‌పామ్‌ను విస్తరించాలంటే, చెట్లు పెట్టాలంటే, సదరు కంపెనీలు, అది ప్రభుత్వంలో ఉన్నవి కావచ్చు, ప్రైవేటు కంపెనీలు కావచ్చు, వాళ్ల వాళ్ల ఆసక్తి ఉన్న ప్రాంతాలకు దరఖాస్తులు పెట్టుకుని, ఇన్ని ఎకరాల్లో మేము పంటసాగుకు, రైతాంగానికి ప్రోత్సాహం ఇచ్చి, buy back policy ద్వారా మేము సిద్ధంగా ఉన్నామని ముందుకు వస్తే, వారికి ఆ ఏరియాను కేటాయించడానికి వీలవుతుంది. ఇందుకు సంబంధించి కమీషనర్‌గారు ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేయడం జరిగింది. ఇందుకు స్పందించి దరఖాస్తు చేసుకున్న కంపెనీల యొక్క సమాచారాన్ని వ్యవసాయ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. ఆ కంపెనీల యొక్క ఆర్థిక స్థోమత, వారి టర్నోవర్ మరియు వారి క్రెడెన్షియల్స్‌ను పరిశీలించడం కొరకు ఎస్ఎఫ్‌సి ద్వారా వారి ఆరిక స్థోమత ఎవాల్యుయేట్ చేయడం జరిగింది. అతి త్వరలో గౌరవ ముఖ్యమంత్రిగారి ఆమోదం పొంది, వీలైనంత త్వరగా కేటాయింపులు జరపడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

అదే విధంగా జోనల్ అలాట్‌మెంటు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తాము. నర్సరీల గురించి గౌరవ సభ్యులు శ్రీ సండ్ర వెంకటవీరయ్యగారు అడిగారు. అది వారి ప్రాంతానికి వర్తిస్తుంది. దానిగురించి అధికారులతో మాట్లాడి, తగు నిర్ణయం తీసుకుంటాము. అదే విధంగా రికవరీ

పర్సెంటేజి రెగ్యులర్‌గా వచ్చేదానికంటే నాలుగు శాతం తగ్గి రావడానికి కారణం ఏమిటని వారు అడిగారు. వెంటనే నిపుణులతో ఒక కమిటీని వేసి, విచారణ జరిపిస్తాము. అందులో ఏవైనా అవకతవకలు జరిగాయని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాము. రైతుల విషయంలో రాజీ అనేదే లేదు. ముమ్మాటికి వారికి న్యాయం చేయడం కొరకే మేము ప్రయత్నిస్తాము.

గౌరవ సభ్యులు గువ్వల బాలరాజు గారు పేద, దళిత రైతులకు ప్రత్యేకంగా ఏమైనా రాయితీ కల్పించడానికి అవకాశం ఉందా అని అడిగారు. ఈ పథకం అన్ని వర్గాల రైతులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. మనం ఏదైనా ప్రత్యేకంగా చేయాలనుకుంటే, ఆ రకంగా ప్రతిపాదనలు వస్తే, గౌరవ ముఖ్యమంత్రిగారి ముందు పెట్టి, దళిత, పేద రైతులకు ఇంకా అదనంగా ఇవ్వడానికి ఆస్కారం ఉంది అనుకుంటే ప్రభుత్వం తప్పకుండా ఆలోచిస్తుందని నేను మనవి చేసుకుంటున్నాను.

అలాగే డ్రిప్ లేకుండా ఈ పంటను వేయడానికి అవకాశం లేదు. డ్రిప్‌లో ఇది ఒక అంతర్భాగమే. దీనికి నీళ్ల వరి కంటే తక్కువ, మక్కల కంటే ఎక్కువ అవసరముంటుంది. ఒక ప్రత్యేకమైన సమావేశాన్ని గౌరవ శాసనసభ్యులతో ఏర్పాటుచేయమని సభ్యులు కోరారు. వీలైనంత త్వరగా తమరి అనుమతి తీసుకుని, ఈ సమావేశాలు జరుగుతున్న సందర్భంలోనే కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసి, ఇంకా ఏమైనా సందేహాలు వారికి ఉంటే తీర్చి, ప్రభుత్వపరంగా నిర్దిష్టమైన చర్యలు తీసుకుని, వీలైనంత వేగంగా ఈ పథకాన్ని అమలుచేయడానికి ఉపక్రమిస్తామని తెలియజేస్తున్నాను. ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్: గౌరవ సభ్యులు మరియు మంత్రివర్యులకు ఒక మనవి. నో సీటింగ్ అని సూచిక ఉన్నచోట కూర్చోవడానికి ఉండదు. ఆరు ఫీట్ల దూరాన్ని పాటించవలసిందిగా మనవి.

ప్రశ్న నెం. 438(8)

సర్వశ్రీ బొల్లం మల్లయ్య యాదవ్, దుర్గం చిన్నయ్య, శ్రీమతి గొంగిడి సునీత, శ్రీ బానోత్ శంకర్ నాయక్, ఎంఎల్.ఏ.లు

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలో ప్రతినెల ఆసరా పథకం క్రింద పింఛను పొందుతున్న వ్యక్తుల సంఖ్య ఎంత?

(ఆ) సదరు ప్రయోజనం కోసం ఖర్చు చేస్తున్న నిధుల పరిమాణం ఎంత?

(ఇ) కేటగిరి వారీగా ఆ వివరాలేమిటి;

(ఈ)పింఛన్లు పొందడానికి ప్రభుత్వం వయో పరిమితిని 65 నుండి 57 సంవత్సరాలకు తగ్గించిన విషయం వాస్తవమేనా;

(ఉ) అయితే, సదరు ప్రతిపాదనను ఎప్పటిలోగా అమలుచేయడమవుతుంది?

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి (శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావు):- (అ) ఆసరా పింఛను పథకం క్రింద 30-08-2020 వ తేదీవరకు రాష్ట్రంలో 38,32,801 మంది ప్రయోజనం పొందారు.

(ఆ) దీని నిమిత్తం ఇప్పటివరకు రూ.31,902.91 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసింది. ఆర్థిక సంవత్సరం వారీగా వివరాలను అనుబంధం-1 రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

(ఇ)కేటగిరి వారీగా ఆసరా వివరాలను అనుబంధం-2 రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

(ఈ) అవునండీ, వయోవృద్ధుల పింఛను కేటగిరి క్రింద పింఛను పొందడానికి వయోవృద్ధుల పింఛను

వయోపరిమితిని 57 సంవత్సరాలను తగ్గించడమవుతుందని గౌరవ ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చారు.

(ఊ) అవునండీ. చర్యను త్వరలో ప్రారంభించడ మవుతుంది.

ప్రశ్న నెం. 438 (బి) కు అనుబంధం - I

ఆర్థిక సంవత్సరం వారీగా ప్రభుత్వం భర్తుచేసిన నిధులు

వరుస సంఖ్య	ఆర్థిక సంవత్సరం	ప్రభుత్వం భర్తు చేసిన నిధులు (రూ. కోట్లలో)
1.	2014-15	1,972.62
2.	2015-16	3,066.34
3.	2016-17	4,438.82
4.	2017-18	5,301.83
5.	2018-19	5,173.29
6.	2019-20	8,710.50
7.	2020-21 (జూలై,2020 వరకు)	3,239.51
	మొత్తం	**31,902.91**

ప్రశ్న నెం. 438 (బి) కు అనుబంధం - II

వరుస సంఖ్య	పింఛను రకం	మొత్తం లబ్ధిదారుల సంఖ్య
1.	వయోవృద్ధులు	1221887
2.	వితంతువులు	1431585
3.	వికలాంగులు	491892
4.	నేతకార్మికులు	36813
5.	కల్లుగీత కార్మికులు	62069
6.	హెచ్ఐవి పేషెంట్లు	32627
7.	ఫిలేరియా పేషెంట్లు	14901
8.	బీడీ పనివారికి ఆర్థిక సహాయం	407268
9.	ఒంటరి మహిళలకు ఆర్థిక సహాయం	133789
	మొత్తం	**3832831**

శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్:- అధ్యక్షా, నిరుపేదలకు, నిరాశ్రయులకు ఉపయోగపడే ఈ ఆసరా పింఛన్ పథకం సామాన్యుడికి అక్షయ పాత్ర వంటిది. ఆస్తిపాస్తులు లేక, రేపటి భవిష్యత్తు ఏమిటో తెలియక అంధకారంలో పడి, కన్నబిడ్డలు దూరమై, తిండి పెట్టే నాధుడు లేక, ఎవరు మమ్మల్ని ఆదుకుంటారా ఆలోచిస్తున్న పరిస్థితుల్లో ఈరోజు ఈ ప్రభుత్వం వారిపాలిట ఒక పెద్ద కొడుకు వాదిరిగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటున్నదనేది నిర్వివాదాంశం. ఈ పరిస్థితుల్లో చిన్నచిన్న ఇబ్బందులు ఏవైతే ఎదురవుతున్నాయో వాటిని మంత్రిగారు పరిశీలించి, పరిష్కరించవలసిందిగా కోరుతున్నాను. ఈ పింఛను పొందడానికి అర్హతను 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు తగ్గించడం వలన, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, తమకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు కాబట్టి, వెంటనే ఈ నిర్ణయం అమలయ్యే విధంగా చూడవలసిందిగా కోరుతున్నాను.

అలాగే కుటుంబంలో భార్యకుగాని, భర్తకు గాని ఈ పథకం వర్తిస్తుంది. భర్త చనిపోతే భార్య పేరు మీదకు లేదా భార్య చనిపోతే భర్త పేరు మీదకు మార్పు చేసే విషయంలో కొంత అలసత్వం జరుగుతున్నది కాబట్టి, వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి, సత్వర చర్యలు తీసుకోవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. డెత్ సర్టిఫికెట్ సమర్పించిన తరువాత, వెంటనే ట్రాన్స్‌ఫర్ అయ్యే విధంగా చర్య తీసుకోవాలని కోరుతున్నాను. అదే విధంగా చిన్నచిన్న సాంకేతిక కారణాల వలన ఓటర్ లిస్టు లేదా ఆధార్ కార్డు ఆధారంగా ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించడం జరుగుతుంది. అయితే కొంత మందికి వయసు ఉన్నా, సాంకేతిక కారణాల వలన ఓటర్ లిస్టు, లేదా ఆధార్ కార్డులో ఆ విధంగా వయసు నమోదు కాకపోవడం వలన వారు పింఛను పొందే అర్హతను కోల్పోతున్నారు. కాబట్టి దానిని సవరించడంతోపాటు అక్కడ ఉన్న అధికారులు పరిశీలించి, వయసుని ప్రామాణికంగా తీసుకుని, సాంకేతిక లోపాలను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఏదైతే పింఛను పథకం అమలు చేస్తున్నామో దాన్ని వారికి కూడా వర్తింపజేయాలని కోరుతున్నాను. నిరుపేదలకు, నిరాశ్రయులకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని అర్హులైన అందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా నేను గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

10.40 ఉ. **శ్రీ దుర్గం చిన్నయ్య** :- తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద కుటుంబాల్లో నివసిస్తున్న ఉన్న వృద్ధులు, వికలాంగులు వితంతువులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత, బీడి కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వృద్ధ కళాకారులకు దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వంలో లేని విధంగా ఆసరా పెన్షన్ ఇచ్చినటువంటి గొప్ప మనసున్న నాయకుడు మన ముఖ్యమంత్రిగారు. రాష్ట్రంలో చాలా మందికి పెన్షన్లు ఇచ్చినప్పటికీ, మంచిర్యాల జిల్లాకు వచ్చే వరకు సుమారు 88,320 మందికి పెన్షన్ అందుతున్నప్పటికీ, గత సంవత్సరం ఆగస్టు 2019 నుండి 2020 వరకు 5,500 మందికి పెన్షన్ ఇచ్చే విషయంలో పెండింగ్ ఉంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో కేవలం 930 మందికి మాత్రమే పెన్షన్ రావడంలేదు. ఒక గ్రామంలో 500 మందికి పెన్షన్ వస్తున్నప్పటికీ, నియోజకవర్గంలోని ఏ గ్రామానికైనా వెళ్లి మా ప్రభుత్వం ఈ పనులు చేస్తుందని చెప్పినప్పుడు, పెన్షన్ రాని ఒకరిద్దరు ముందు వరుసలో కూర్చుని మాకు పెన్షన్ రావడంలేదని గళాలు ఎత్తే సందర్భం ప్రతి నియోజకవర్గంలో ఉంది. పెన్షన్ పొందే అర్హత వయస్సును 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు కుదించామని ముఖ్యమంత్రిగారు ప్రకటించినప్పటి నుండీ ఇప్పటివరకు అమలు జరగడంలేదు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను ఎప్పటివరకు ఇస్తారని మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీమతి గొంగిడి సునీత :- అధ్యక్షా, గౌరవ మంత్రిగారు ఇంతకుముందు ఇచ్చిన సమాధానంలో 57 సంవత్సరాలకే పెన్షన్ పొందే విధంగా వయస్సును తగ్గిస్తూ, ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చారని చెప్పారు. నేను మూడు ప్రశ్నలను అడగబోతున్నాను. 65 సంవత్సరాలు దాటిని వారికి కూడా ఇంకా పెన్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. వారిని వెంటనే గుర్తించి పెన్షన్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. గతంలో మనం పెన్షన్ మంజూరు చేసినప్పుడు వారికి 63 లేక 64 సంవత్సరములు ఉండవచ్చు, ఇప్పుడు వారికి 65 సంవత్సరాలు వచ్చి ఉంటాయి. కాబట్టి, వారికి పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను.

2004 సంవత్సరంలో గౌరవ ముఖ్యమంత్రిగారు కేంద్ర కార్మికశాఖామంత్రిగా ఉన్నప్పుడు బీడీ కార్మికుల కోసం అనేక ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టారు. అపుడే, ఆలేరు నియోజకవర్గంలో ఇఎస్ఐ ఆసుపత్రిని కూడా కట్టించారు. బీడీ కార్మికుల కోసం చేపట్టిన ఇఎస్ఐ డిస్పెన్సరీలో చాలా మంది అర్హత పొంది ఇఎస్ఐ గుర్తింపు కార్డులు పొందినప్పటికీ, వారికి పిఎఫ్ కార్డులు లేవు. కాబట్టి, దయచేసి ఇఎస్ఐ గుర్తింపు కార్డు ఉన్న వారికి కూడా పెన్షన్ వర్తించే విధంగా మంత్రిగారు ముఖ్యమంత్రిగారితో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిందిగా మంత్రిగారికి సూచిస్తున్నాను.

రాష్ట్రంలోని అనేక మందికి పెన్షన్‌లు ఇస్తున్నాము. అదేవిధంగా మరుగుజ్జులను కూడా గుర్తించి పెన్షన్ ఇవ్వాలని నేను కోరుతున్నాను. ఎందుకంటే, వారు 2, 3 అడుగుల ఎత్తులో ఉండి ఇతర పనులకు వెళ్లే పరిస్థితి వారికి ఉండదు. కాబట్టి, మరుగుజ్జులను కూడా వికలాంగులుగా గుర్తించి వారికి కూడా పెన్షన్ మంజూరు చేయాలని కోరుతున్నాను.

శ్రీ బానోత్ శంకర్ నాయక్ :- అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర జనాభాలో ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీల్లోని ఎక్కువ పేదరికం ఉన్న సంగతి మనందరికీ తెలుసు. కరోన మరియు ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన ప్రజలు ఆర్థికంగా దెబ్బ తిన్నప్పటికీ, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ వారిని ఆదుకుంటుంది. అందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆసరా పెన్షన్‌లను మేము ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వారు ప్రచారం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంత మొత్తాన్ని ఇస్తుందనే వివరాలను తెలపాల్సిందిగా కోరుతున్నాను. పెన్షన్ పొందే అర్హతను 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు కుదిస్తున్నట్లు, ఇప్పుడే మంత్రిగారు చెప్పడం జరిగింది. నా నియోజకవర్గంలో చాలా మందికి పెన్షన్ ఇచ్చే విషయంలో పెండింగ్ ఉంది. ఎప్పటి వరకు పెన్షన్‌లను ఇస్తారో చెప్పాల్సిందిగా కోరుతున్నాను. నా నియోజకవర్గంలో నిరుపేద కుటుంబంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బోదకాలు బాధితులు ఈ విధంగా చాలా

మందికి ఆసరా పెన్షన్ అందడంలేదు. వీరికి ఎప్పటివరకు పెన్షన్ అందిస్తారనే విషయాలను తెలపడంతోబాటు, వారికి దయచేసి పెన్షన్ అందించాలని కోరుతున్నాను.

శ్రీ దానం నాగేందర్ :- అధ్యక్షా, నేను మూడు ప్రశ్నలు అడగదలచుకున్నాను. ప్రత్యేకంగా ఆసరా పెన్షన్ పొందే వయస్సును 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు కుదిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రకటించిన రోజు రాష్ట్రం మొత్తం మీద సంబరాలు జరిగాయి. గతంలో ఒకరు చనిపోతే మరొకరికి పెన్షన్ వచ్చే పరిస్థితి ఉండేది. కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు సాచ్చురేషన్ పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలనే ఆలోచనతో ఆసరా పెన్షన్లు అందించే కార్యక్రమం చేపట్టడం జరిగింది. 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు కుదించి పెన్షన్ ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని ఇప్పుడే మంత్రిగారు చెప్పారు. ఆ పరిశీలన ఎప్పటి వరకు జరుగుతుందనేది నా ప్రశ్న. 65 సంవత్సరాల నుండి 57 సంవత్సరాలకు కుదించిన తరువాత 57సంవత్సరాల వయస్సు గల వారు ఇప్పటి వరకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు. 2020-2021 సంవత్సరానికి సంబంధించి జులై మాసం వరకు 32కోట్ల రూపాయలు ఇచ్చారని మంత్రిగారు చెప్పారు. క్యాటగిరీలతోబాటు, జిల్లావారీగా ఉన్న జాబితాను శాసనసభ్యులకు ఇచ్చినట్లైతే, శాసనసభ్యులు వారి నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు ఇంత మంది లబ్ధిదారులకు మేము ఆసరా పెన్షన్‌లు ఇప్పించామని చెప్పడానికి అవకాశం ఉండడం వలన శాసనసభ్యులకు కూడా గౌరవం దక్కుతుంది. ఈ అంశం పరిశీలనలో ఉందా? ఒకవేళ లేకపోతే పరిశీలనలోకి తీసుకుంటారా అని గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

(JANAB JAFFAR HUSSAIN, NAMPALLY CONSTITUENCY) جناب جعفر حسین:

محترم اسپیکر صاحب! آپ کا بہت بہت شکریہ۔ میں آسرا پنشن اسکیم کے تعلق سے دو سوال کرنا چاہتا ہوں۔ حکومت تلنگانہ نے تلنگانہ بننے کے بعد آسرا پنشن میں اضافہ کرکے اس کو 1,000 روپئے کیا تھا۔ ان بیواؤں کے لئے 2,016 روپئے اور معذورین کے لئے 3,016 روپئے پنشن دی جارہی ہے۔ معذورین کی تعداد 12,21,887 بیواؤں کی تعداد 14,31,585 اور معذورین کی تعداد تقریباً 49,000 ہے۔ صاحب! میرا آپ سے ایک سوال ہے کہ آپ پنشن کے سلسلہ میں 65 سال کی حد کو اب 57 سال کررہے ہیں۔ اس میں کئی لوگوں نے درخواست دی ہے اور وہ تمام درخواستیں زیر التوا ہیں۔ اس کے علاوہ پچھلے دو سال سے درخواستیں پینڈنگ ہوگئی ہیں، انہوں نے بھی درخواستیں دی ہیں۔ اسی طرح معذورین نے بھی درخواستیں دی ہیں۔ مگر دو سال سے ان درخواستوں کو منظور نہیں کیا گیا ہے۔ ان لوگوں کو ابھی تک پنشن کی سہولت نہیں مل رہی ہے۔ لہٰذا میں آپ کے ذریعہ منسٹر صاحب سے یہ کہنا چاہتا ہوں کہ بیواؤں اور 65 سال کے بزرگوں کی پینڈنگ درخواستیں

10.50 ఉ. **శ్రీ కె.పి. వివేకానంద** :- అధ్యక్షా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి దేశ, రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి వలసలు వస్తుంటారు. వారు జిహెచ్ఎంసిలో అప్లికేషన్లు పెట్టుకున్నప్పటికి వెరిఫికేషన్ చేయడం పెండింగులో ఉంటున్నాయి. కలెక్టర్ దీనికి శాంక్షన్ అథారిటీగా ఉంటారు. నెలకు వంద,యాభై అప్లికేషన్లు తీసుకోవాలని లిమిట్ పెట్టారు. జిహెచ్ఎంసి ప్రాంతంలో నిత్యం ఎన్ని అప్లికేషన్లు వస్తున్నాయి? ఎన్ని వెరిఫికేషన్లు పూర్తి అవుతున్నాయి? కలెక్టర్ వద్ద ఎన్ని అప్లికేషన్లు పెండింగులో ఉన్నాయి అనే వివరాలు తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను. మేము ఎప్పుడు వెళ్లి అడిగినా వారు మేము అప్పుడే చేశాము, సంవత్సరం అవుతున్నది ఆరునెలలు అవుతున్నది అంటున్నారు. కానీ జిహెచ్ఎంసి వాళ్లు వెరిఫికేషన్లు చేయడం లేదు. కాబట్టి, వెరిఫికేషన్ ప్రాసెస్‌ను విషయంలో కొంత అథారిటీగా ఉండాలని మంత్రిగారిని కోరుతున్నాను.

దివ్యాంగులకు కూడా సర్టిఫికేట్లు, సదరం క్యాంప్స్ రెగ్యులర్‌గా నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. జిహెచ్ఎంసిలో ఇప్పటికే సుమారు 350 బస్తీదావఖానాలు వచ్చాయి కాబట్టి ప్రతి దగ్గర సైక్లింగ్ పద్ధతిలో సదరం క్యాంపులను నిర్వహిస్తే దివ్యాంగులందరూ పెన్షన్లు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి దీని పట్ల మంత్రిగారు దృష్టి సారించి జిహెచ్ఎంసి ప్రాంతంలో ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు :- తెలంగాణ ప్రభుత్వం సామాజిక భద్రతలో భాగంగా పేదలందరికి సురక్షితమైన, గౌరవప్రదమైన జీవనం అందించాలని మరియు సమాజంలో

దుర్భరమైన జీవనం గడుపుతున్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆసరా పెన్షన్‌ను నవంబర్ 2014 సంవత్సరం ప్రవేశపెట్టడం జరిగింది. రూ.1500లు ఇస్తున్న ఆసరా పెన్షన్లు వికలాంగులకు రూ.1500లు ఇస్తున్న దానిని 2019వ సంవత్సరం నుంచి రూ.3016లు, మిగిలిన 8రకాల పెన్షన్లను రూ.1,000ల నుండి రూ.2,016కు పెంచడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను 11,725కోట్లు కేటాయించడం జరిగింది. ఇప్పటి వరకు రూ. 3,952కోట్లు విడుదల చేయడం జరిగింది. ప్రస్తుత పెన్షన్లు 38,32,831 మందికి ఇవ్వడం జరిగింది. గతంలో ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు తెలంగాణకు సంవత్సరానికి రూ.800కోట్లు ఇవ్వడం జరిగింది. ఎంత శాతం పెరిగినదో మీరు మరొక్కసారి ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెన్షన్లకు మాత్రమే రూ.11,725కోట్లు ఖర్చు పెడుతున్నాము. ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ఈ విధంగా చేయడం లేదు. ఒక నెలకు రూ.977కోట్లు ఖర్చు పెడుతున్నాము.

కేంద్రం నుంచి ఎంత శాతాన్ని ఇస్తున్నారని శంకర్‌నాయక్ గారు అడిగారు. సంవత్సరానికి రూ.210కోట్లు ఇస్తున్నారు. రాష్ట్రం ఖర్చు పెట్టేది రూ.11,725కోట్లు ఖర్చు పెడుతున్నాము. అంటే బడ్జెట్ కేవలం 1.8శాతాన్ని మాత్రమే వాళ్లు ఇస్తున్నాను. వందకు రెండు రూపాయల కంటే కూడా తక్కువగా ఇస్తున్నారు. అక్కడక్కడ కొంత మంది గొప్పలు చెప్పుకుంటున్నారని శంకర్‌నాయక్‌గారు చెప్పడం వల్ల దానిని మీ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు చెప్పాలంటే గతంలో వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు మాత్రమే పెన్షన్లు ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం వల్ల సుమారు 38వేల మందికి పెన్షన్ ఇవ్వడం జరుగుతున్నది. సుమారు 62వేల మంది కల్లుగీత కార్మికులకు కూడా పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. 32,627 మంది హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు, 14,901 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు బి.డి కార్మికులకు 4,7,269 మందికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. ఒంటరి మహిళకు పెన్షన్ ఇవ్వాలని శాసనసభలో సభ్యులు అడగడం వల్ల ముఖ్యమంత్రిగారు దానిని దృష్టిలో పెట్టుకుని భర్త వదిలి పెట్టిన వారు కానీ, వివాహం చేసుకోకున్న ఉన్న వారు కానీ, ఆర్థిక భృతి లేక ఇబ్బంది పడే వారందరికి పెన్షన్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ విధంగా లక్షా ముప్పై మూడు వేల ఏడు వందల ఎనభై తొమ్మిది మందికి పెన్షన్లను ఇవ్వడం జరుగుతున్నది.

కొంత మంది సభ్యులు కొన్ని ప్రశ్నలు అడిగారు. మల్లయ్య యాదవ్‌గారు పెన్షన్ అర్హత వయస్సును 57 సంవత్సరాలకు ఎప్పుడు తగ్గిస్తారని అడిగారు. కరోనా కారణంగా సర్వే చేయడానికి ఇబ్బంది ఉన్నది. ముఖ్యమంత్రిగారి ప్రణాళికలో ఈ విషయం ఉన్నందున అతి త్వరలోనే వారికి కూడా పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని సభ్యులకు తెలియజేస్తున్నాను. మాట ఇచ్చాము కాబట్టి తప్పకుండా ఇవ్వాలి అనే ఆలోచన ముఖ్యమంత్రిగారు చేస్తున్నారు. కొంత మంది వితంతువులకు పెన్షన్ రాలేదని వారికి కూడా పెన్షన్ ఇవ్వాలని సభ్యులు అడగడం జరిగింది.

దుర్గం చిన్నయ్యగారు మంచిర్యాలలో కొన్ని పెన్షన్లు పెండింగులో ఉన్నాయని వాటిని ఏమి చేస్తారని అడిగారు. దానికి సంబంధించిన రిపోర్టును నేను తెప్పించుకుంటాను. వాటిని కూడా త్వరలో ఇవ్వడం జరుగుతుంది. గొంగడి సునీత గారు పిఎఫ్ కార్డులు, బి.డి కార్మికుల పెన్షన్ల విషయం గతంలో కూడా నా దృష్టికి తీసుకొని వచ్చారు. తప్పకుండా ఇవ్వడం జరుగుతుంది. మరగుజ్జులకు కూడా ఇది వరకే పెన్షన్లు ఇస్తున్నాము. వాళ్లకు కూడా డాక్టర్ సర్టిఫికేట్ ఉంటే ఇవ్వాలనుకున్నాము. దానిని కూడా పరిశీలించడం జరుగుతుంది. దానం నాగేందర్ గారు 65 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు పెన్షన్ వయస్సును తగ్గించాలని కోరారు ఆ విషయం నేను ఇంతకు ముందే చెప్పాను. కరోనా తీవ్రంగా ఉండడం వల్ల సర్వే చేయడం ఇబ్బంది కాబట్టి కొంత ఆలస్యం అవుతున్నది. తప్పకుండా చేస్తాము. నియోజకవర్గాల

వారీగా లిస్టు పంపించమని దానం నాగేందర్‌గారు చెప్పారు. జిల్లా వారీగా, నియోజకవర్గాల వారీగా, మండల వారీగా, గ్రామాల వారీగా ప్రతి ఎమ్మెల్యేకు లిస్టును పంపించడం జరుగుతుంది.

శంకర్ నాయక్ గారు 57 సంవత్సరాలకు పెన్షన్ వయస్సును తగ్గించాలని అడిగారు. కేంద్ర ప్రభుత్వం ఎంత శాతం నిధులు ఇస్తున్నదని అడిగారు. వారు చెప్పినది వాస్తవం. బిజేపి నాయకులు ప్రతి చోట కేంద్ర ప్రభుత్వమే మొత్తం ఇస్తున్నదనే ఆపోహలు సృష్టిస్తున్నారు. వాళ్లు వందకు రెండు రూపాయల కంటే తక్కువే ఇస్తున్నారు. రాష్ట్రం సుమారు 11,000కోట్లు ఖర్చు పెడితే వాళ్లు కేవలం రూ.200కోట్లు ఇస్తున్నారు. ప్రతి చోటా వారు వారికి నచ్చినట్లుగా స్టేట్‌మెంట్లు ఇస్తారు. దానికి సరైన జవాబు చెప్పాల్సిన బాధ్యత శాసనసభ్యులదే. రాష్ట్ర ప్రభుత్వమే పెన్షన్లు ఇస్తున్నదనేది ఘంటాపథంగా చెప్పవల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. గ్రామాల్లోని పెన్షనర్‌దారులు కేసీఆర్‌గారిని వారి పెద్ద కొడుకుగా చూస్తున్నారు. కడుపున పుట్టిన కొడుకును కూడా పెద్ద కొడుకుగా చూడడం లేదు. నా పెద్ద కొడుకు కేసీఆర్‌గారు అని గర్వంగా గ్రామాలలో వృద్ధులు చెప్పుకుంటున్నారు. ఆ పెన్షన్ ద్వారానే వారికి జీవన భృతి కలుగుతున్నదనే ప్రజల లోపల ఉన్న భావనను మనం అర్థం చేసుకోవాలి.

11.00 ఉ. జిహెచ్ఎంసి పరిధిలో అధికారులతో మాట్లాడి, అవి కూడా అందరికీ ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. జాఫర్ గారు కూడా వయోపరిమితిని ప్రభుత్వం 65 నుండి 57 సంవత్సరాలకు తగ్గించడం జరిగింది, దాన్ని ఇంతవరకు అమలులోకి తీసుకురాలేదని అన్నారు. కొత్త పెన్షన్ తీసుకునే వారు, చనిపోయిన వారు ఎంతమంది అనే దానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని సర్వే చేయడం జరిగింది. ఇంకా కొన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీల నుంచి వివరాలు రావలసి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా ప్రభావం ఉన్నందున ఆ వివరాలు ఇంకా రాలేదు. సభ్యులు దయచేసి అర్థం చేసుకోవాలి. తొందరలోనే ముఖ్యమంత్రి గారు అందరికి పెన్షన్లు ఇచ్చే విధంగా తొందరలోనే అనౌన్స్ చేస్తారని ఈ సందర్భంగా తెలియజేస్తూ, మంచి ప్రశ్నలు అడిగిన గౌరవ సభ్యులందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ దానం నాగేందర్ :- సార్, ఇప్పుడే గౌరవ మంత్రి గారు చెప్పారు. భారతదేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు అర్హులైన వారందరికి పెన్షన్ అందజేసే విధంగా చర్యలు తీసుకున్న సందర్భంలో ఈ సభ ద్వారా ఒక సమాచారం పోవలసిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు నిధులు రావడం లేదనే విషయాన్ని ఈ సభ ద్వారా స్పష్టంగా చెప్పవలసిన అవసరముంది. ఎందుకంటే ఇంత పెద్ద కార్యక్రమాన్ని మనం తీసుకున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి డబ్బులు ఇవ్వకుండా ప్రతి దాన్ని కేంద్రమే ఇచ్చినట్లుగా చెప్పుకుంటోంది. పెన్షన్ పొందడానికి వయోపరిమితిని ప్రభుత్వం 65 నుండి 57 సంవత్సరాలకు తగ్గించిన తరువాత రాష్ట్రంలో సంబరాలు జరిగాయి. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చి ఉంటే బాగుండేది. ఈరోజు రూ.32 కోట్ల బదులు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసే పరిస్థితి ఉన్నది. అందరూ ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే, వేరే వాళ్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది కాని మన ప్రభుత్వం పెన్షన్ ఇవ్వడం లేదని కొద్దిగా అపోహ పడుతున్నారు. దానివల్ల తప్పుడు సంకేతాలు పోతున్నాయి కాబట్టి చెప్పవలసిన అవసరముంది.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావు :- కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని మేము ఎక్కడా చెప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్లు ఇస్తుందని ఎంఎల్ఏలకు ఒక అపోహ ఉంది. వారి ఉపన్యాసాల్లో కేంద్ర ప్రభుత్వమే మొత్తం పెన్షన్లు ఇస్తుందని స్పీచ్‌లు ఇస్తూ చెప్పుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.11,725 కోట్లు పెన్షన్ రూపంలో ఇస్తున్నది. గతంలో తెలంగాణ రాక ముందు తెలంగాణ ప్రాంతంలో పెన్షన్లు సంవత్సరానికి రూ.800 కోట్లు మాత్రమే ఉండేవి. ఈరోజు పెన్షన్‌దారులు ఎలా బతుకుతారో అని ఆలోచన చేసి,

పెన్షన్‌దారుల సంఖ్యను వారికి చెల్లించే మొత్తాన్ని గణనీయంగా పెంచిన ఏకైక ముఖ్యమంత్రి భారతదేశంలో ఒక్కకేసీఆర్ గారు అనేది మనం గుర్తు పెట్టుకోవాలి.

(సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారి నుండి అంతరాయం)

నేను స్పష్టంగా చెబుతున్నాను. కేంద్ర ప్రభుత్వం నుండి మన రాష్ట్రానికి వచ్చే వాటా రూ.210 కోట్లు. అంటే కేవలం 1.8 శాతం. రూ.11,725 కోట్లకు రూ.210 కోట్లకు ఎంత తేడా ఉంది అధ్యక్షా? అంటే కేంద్ర ప్రభుత్వం ప్రతి వంద రూపాయలకు గాను రెండు రూపాయల కంటే తక్కువ ఇస్తుంది. అంత తక్కువ ఇస్తూ, మొత్తం నిధులు మేమే ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు కాదా?

ప్రశ్న నెం.441(9)

సర్వశ్రీ రాథోడ్ బాపూరావ్, రవీంద్రకుమార్ రావత్, శ్రీమతి హరిప్రియ బానోత్, శ్రీ బానోతు శంకర్‌నాయక్ ఎం.ఎల్.ఏ.లు గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో 500 కంటే ఎక్కువ జనాభా కలిగి ఉన్న తండాలు, గిరిజన ఆదివాసీ గూడాలను గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం మార్చిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, గ్రామ పంచాయతీలుగా మార్చబడిన సదరు తండాలు, గిరిజన ఆదివాసీ గూడాల సంఖ్య ఎంత?

ఇ) కొత్తగా ఏర్పాటైన సదరు గ్రామ పంచాయతీల కోసం మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

(గౌరవ పంచాయతీరాజ్, గ్రామణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు) :- అ) అవునండీ.

ఆ) తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చే ప్రక్రియను ఇది వరకే పూర్తి చేసి, 2018, టిఎస్‌పిఆర్ చట్టంలోని VIII వ షెడ్యూల్‌లో చేర్చడమయింది. మైదాన ప్రాంతంలో 100 శాతం ఎస్‌టి జనాభాతో కూడిన గ్రామ పంచాయతీలు 1177 తండా పంచాయతీలు ఉండగా, షెడ్యూల్డు ప్రాంతంలో 650 గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేయడమయింది. రాష్ట్రంలో మొత్తం 1281 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ఇ) ప్రభుత్వం గ్రామ పంచాయతీలకి ప్రతి నెల రూ.308.00 కోట్ల గ్రాంటును సమకూరుస్తున్నది. ఈ సంవత్సరంలో 1847.50 కోట్లను విడుదల చేయడమయింది. సదరు మొత్తంలో పంచాయతీలు వాటి అవసరం మేరకు పారిశుద్ధ్య చర్యలు, ఇతర మౌలిక సదుపాయాలను చేపడుతున్నాయి. అంతేకాక, వాటి వార్షిక ఆదాయం 5.00 లక్షల కంటే తక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వం కూడా గ్రామ పంచాయతీలకు సహకారమందిస్తున్నది. ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.5.00 లక్షల మేరకు తగ్గుదల మొత్తానికి అదనపు గ్రాంటును విడుదల చేయడమవుతున్నది. ఆ ప్రకారంగా, ప్రభుత్వం రూ.97.46 లక్షలను విడుదల చేసింది.

మిస్టర్ స్పీకర్ :- దయచేసి గౌరవ సభ్యులకు మరొక్కసారి విజ్ఞప్తి. మీరు సూటిగా ప్రశ్నలు అడిగితే అన్ని ప్రశ్నలు పూర్తి చేయగలుగుతాం. దయచేసి ప్రశ్నలు సూటిగా అడగండి.

శ్రీ రాథోడ్ బాపూరావ్ :- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకుని గిరిజన తండాలను, ఆదివాసుల గూడేలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగింది. అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గాని, కేంద్ర ప్రభుత్వం గాని ఈ యొక్క సమస్యను పట్టించుకోలేదు. ఆరోజు తండాలు, గూడేలలోని ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న సమయంలో మన ముఖ్యమంత్రి గారు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం జరిగింది. దానిప్రకారం ఈరోజు తండాలను, గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగింది. నా యొక్క బోథ్

నియోజకవర్గంలో 114 గ్రామ పంచాయతీలు ఉంటే 115 కొత్తగా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం మొత్తం కలిపి 229 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే ఒక ఆదివాసీ గూడెంలో ఒక సమస్య తలెత్తింది. అక్కడ ఉన్న రెండు గ్రామాలు గ్రామ పంచాయతీగా తమకు చేయాలంటే తమకు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ సమస్యను పరిష్కరించాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రమావత్ రవీంద్ర కుమార్ :- అధ్యక్షా, తండాలు, గూడేలు గ్రామ పంచాయతీలు కావాలనే నినాదంతో చాలా సంవత్సరాలుగా గిరిజన సంఘాలు పోరాటం చేశాయి. గతంలో పరిపాలన చేసిన ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి, గెలుపొందిన తరువాత అసలు పట్టించుకోకపోయేది. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి యొక్క నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా చేయడమనేది చాలా హర్షించదగిన విషయం. ఎందుకంటే చాలా రోజుల నుండి గ్రామాలకు గిరిజన తండాలు ఆమడదూరంలో ఉండటం వల్ల మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యాలు, రహదారులు లేక అనేక ఇబ్బందులు పడుతుండేవి. అటువంటి పరిస్థితుల్లో తమ తండాలలో, గూడేలలో తామే పరిపాలన చేసుకుని, అభివృద్ధి చేసుకునే ఒకగొప్ప అవకాశం కల్పించింది టిఆర్ఎస్ ప్రభుత్వం. దానివల్ల దాదాపు 3,146 గ్రామ పంచాయతీలలో గిరిజన సర్పంచులు పదవి బాధ్యతలు చేపట్టి పరిపాలనా చేసే అవకాశం కూడా కలిగింది.

11.10 ఉ. ప్రధానంగా పల్లెప్రగతి పేరుతో కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రభుత్వం నిర్దేశించిన నిర్దేశకాలకు అనుగుణంగా స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు అదేవిదంగా తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసి గ్రామాలల్లో పరిశుభ్రమైన వాతావరణంలో, పచ్చదనంతో కళకళలాడే విధంగా గిరిజన తండాలు, గుడాలు వర్ధిల్లుతున్నాయంటే గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి యొక్క చొరవ వల్లనే అని గిరిజనులందురూ సంతోషంగా ఉన్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలల్లో చిన్న చిన్న తండాలు గుడాలు ఉన్నాయి. అక్కడ కనీస వసతులు లేని పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి, నూతనంగా ఏర్పడిన గ్రామం పంచాయతీలకు భవనాల నిర్మాణాల కొరకు గౌరవ మంత్రిగారు గౌరవ ముఖ్యమంత్రిగారితో మాట్లాడి గ్రామం పంచాయతీలకు భవనాల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నాను. అదేవిధంగా కొన్ని నియోజకవర్గాల్లో గ్రామం పంచాయతీలు ఏర్పాటు చేసేటప్పుడు గౌరవ శాసన సభ్యులకే అధికారం ఇచ్చారు. ఆ తొందరపాటులో కొన్ని తండాల, గుడాలు మిస్ అయ్యాయి. అందులో మా దేవరకొండ నియోజకవర్గం కావచ్చు, మా సోదరుడు అచ్చంపేట సభ్యులు బాలరాజు కూడా చెబుతున్నారు. అక్కడక్కడ కొన్ని తండాల, గుడాలు జన సాంద్రత ఉన్నా ఏర్పాటు చేయలేకపోయాము. అలాంటి వాటికి ఏమైనా అవకాశం కల్పిస్తే బాగుంటుంది. ప్రధానంగా గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి ఆలోచన ఏమంటే ప్రతి గ్రామ పంచాయతీ నుండి మండల హెడ్‌క్వార్టర్‌కి బిటి రోడ్డు నిర్మాణం కార్యక్రమం మనం గతంలో తీసుకున్నాము. ఇది గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయకముందు. నూతనంగా కొన్ని తండాల, గుడాలు గ్రామపంచాయతీలకు మండల హెడ్ క్వార్టర్‌కి బిటి రోడ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా నిధులు ఏర్పాటు చేయాలి, కొన్ని తండాలు, గూడేలలో మట్టి రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. వాటికి ప్రత్యేకమైన చొరవ తీసుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బానోత్ హరిప్రియ :- అధ్యక్ష, ముందుగా గిరిజన తండాలను, గుడాలను గ్రామపంచాయతీలుగా మార్చిన గౌరవ ముఖ్యమంత్రిగారికి తండాలు, గుడాల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గ్రామపంచాయతీలుగా మార్చిన తరువాత రాష్ట్రంలోని 3,146 గ్రామపంచాయతీలను పూర్తి స్థాయిలో పరిపాలన గిరిజనులకే బాధ్యతలు అప్పగించారు. కానీ చెక్ పవర్స్ విషయంలో ఉప సర్పంచ్‌లకు

కూడా పవర్స్ ఇవ్వడంతో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గ్రామపంచాయతీలను వార్డు సభ్యులుగా నాన్ ట్రైబ్స్ కూడా పోటి చేస్తున్నారు. నాన్ ట్రైబ్స్ ఉప సర్పంచ్‌లుగా రావడంతో మనం ఏదైతే గిరిజనులకు బాధ్యతలు అప్పగించామో ఆ గ్రామ పరిపాలన పూర్తి స్థాయిలో జరగకపోవడం వల్ల కొన్ని అవంతరాలు ఏర్పడుతున్నాయి కాబట్టి, వాటిని కూడా గిరిజనులకే కెటాయించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే పంచాయితీ కార్యదర్శి పూర్తి స్థాయిలో విధులలో లేకపోవడం వల్ల, కొన్ని చోట్ల రాలేకపోవడం వల్ల రెండు మూడు గ్రామ పంచాయితీల విధుల్ని ఒకే కార్యదర్శి నిర్వహించడం వల్ల కొంత భారం పడుతోంది, పర్యవేక్షణ లోపం జరుగుతోంది. కాబట్టి, ప్రతీ ఒక్క గ్రామ పంచాయితీలకు కార్యదర్శులను కెటాయించాలని మంత్రిగారిని తమరి ద్వారా కోరుతున్నాను. ఉమ్మడి గ్రామ పంచాయితీలుగా ఉన్నప్పుడు సంత రూపంలో, చెరువుల రూపంలో మరియు ఇతరత్రా రూపాలలో రెవెన్యూ ఉండేది. ఎప్పుడైతే గ్రామపంచాయితీలు చిన్న గ్రామ పంచాయితీలుగా మారినప్పుడు దాదాపు కోటి రూపాయలు వచ్చే ఆదాయం ఒకే గ్రామ పంచాయితీకి పరిమితం అవ్వడం వల్ల మిగిలిన గ్రామ పంచాయితీలు రెవెన్యూను కొల్పోవాల్సి వస్తోంది. అటువంటి గ్రామ పంచాయితీలకు ఆదాయం వచ్చే విధంగా సంత రూపంలో, చెరువుల రూపంలో ఇతరత్రా రూపాల్లో ఆ గ్రామ పంచాయితీల్లో రైతు బజార్లను కేటాయించడం ద్వారా, రైతులు పండించిన సరుకులు ఆ గ్రామ పంచాయితీల్లోనే అమ్ముకునే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టవల్సిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బానోతు శంకర్ నాయక్ :- అధ్యక్ష, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీ సంక్షేమం పేరిట గడచిన ఏడు శతాబ్దాలలో అనేక పథకాలు ప్రవేశ పెట్టి ఎంతో గొప్పగా అమలు చేస్తున్నామని చెప్పుకోవడం జరిగింది. కానీ మన ప్రియతమ నాయకుడు కేసీఆర్‌గారు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉద్యమ సమయంలో గూడేలను, తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చుతానని ఇచ్చిన మాట ప్రకారం తండాలను, గుడాలను పంచాయితీలుగా మార్చడం జరిగింది. మా ప్రజల తరపున గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు గౌరవ సభ్యులు తండాలకు సరైన రోడ్లు లేక, మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న విషయం మీ అందరకీ తెలుసు. అలాగే గూడాలలో, చిన్న చిన్న తండాలలో ఆర్‌సిసి బిల్డింగ్‌లు లేక, గ్రామ పంచాయితీ భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం మీ అందరికి తెలుసు. ఇజీయస్ ద్వారా గ్రామ పంచాతీలకు కొత్త భవనాలు నిర్మించాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే భారి వర్షాలకు రవాణా సదుపాయం లేక గర్భిణీస్త్రీలు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం మనందరికి తెలుసు. కాబట్టి, ఆ గ్రామాలకు బిటి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. కొన్ని తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాలని గొడవ చేస్తున్నారు. అలాగే మన ప్రియతమ నాయకులు కేసీఆర్‌గారు, డైనమిక్ అండ్ డేరింగ్ మా ప్రియతమ నాయకులు కేటీఆర్ గారు, పంచాయతీరాజ్ మంత్రిగారు ఇనుగుర్తిని మండలం చేస్తామని చెప్పడం జరిగింది. దయచేసి ఇనుగుర్తిని మండలంగా మార్చాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఆత్రం సక్కు :- అధ్యక్ష, తెలంగాణ స్ఫూర్తి, 'మాఓనాటే మాఓరాజ్' అనే కొమురం భీం నినాదాన్ని తీసుకొని తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న గౌరవ ముఖ్యమంత్రిగారు. తండాలను గూడాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. గతంలో మనం ఎక్కడా కూడా చూడని విధంగా ప్రతీ గ్రామంలో స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, రైతు వేదికలు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం, నీటి సౌకర్యంలేని ప్రాంతాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో అటవీ అధికారులు ఇబ్బంది పెడుతున్న సందర్భాలు ఉన్నాయి. కాబట్టి, మనం ఎక్కడైతే స్మశాన

వాటికలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, రైతు వేధికలు ఏర్పాటు చేశామో అక్కడ పూర్తి స్థాయిలో, రోడ్డు మరియు నీటి సౌకర్యం కల్పించాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ :- జీరో అవర్‌లో ప్రస్తావించే సభ్యులు ఛీప్ విప్‌గారికి పేర్లు పంపించండి. ఇక్కడ విడివిడిగా ఇస్తే ఇబ్బందౌవుతుంది.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు:- అధ్యక్ష, కేసీఆర్‌గారు గిరిజన తండా ప్రజలకు ఇబ్బంది కలుగవద్దు, స్వయం పరిపాలన కల్పించే ఉద్దేశంతో వారి ఎన్నో సంవత్సరాల కలను నిజం చేస్తూ కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగింది. చాలా మంది గౌరవ సభ్యులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. గత ప్రభుత్వాలు, పలు రాజకీయ పార్టీలు చాలా హామీలు ఇచ్చాయి. ఎవ్వరు చేయని విధంగా ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు తండాలను గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం వల్ల గిరిజనుల ఆరాధ్య దైవంగా నిలిచే అవకాశం కేసీఆర్‌గారికే దక్కుతుంది. 4383 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడినవి. మొత్తం 12,751 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వంద శాతం గిరిజన జనాభా ఉన్న1177 గ్రామపంచాయితీలను చేయడం జరిగింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కొత్తగా ఎర్పడినవి 650.

11.20 ఉ. కొత్తగా ఏర్పాటైనవి 1827, గిరిజనులు, షెడ్యూల్డ్ కులాలకు సంబంధించినవి కొత్తవి పాతవి అన్నీ కలిపి 2458 కొత్తగా ఏర్పాటు చేయడం జరిగింది. చాలా మంది చాలా సమస్యల గురించి ప్రస్తావించారు. పదిహేనవ ఆర్థిక సంఘం ఎంత ఇస్తోందో రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే ఇస్తోంది. మీకందరికీ ఇది తెలిసి ఉండాలి. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈవిధంగా ఇవ్వడంలేదు. పల్లె ప్రగతి కార్యక్రమం పెట్టి గ్రామాలను బాగు చేయాలని ఆర్థిక సంఘం ఎంత ఇస్తోందో అంతే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గతంలో ఏ రాష్ట్రంలో ఈ విధంగా ఇవ్వలేదు. ఆర్థిక సంఘం రూ.154 కోట్లు ఇస్తే, మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ రూ.154 కోట్లు ప్రతి నెలా ఇవ్వడం జరుగుతోందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

గిరిజన ఎమ్మెల్యేలు, షెడ్యూల్డ్ కులాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి గారి దృష్టికి కొన్ని విషయాలు తీసుకొచ్చారు. సార్, వంద జనాభా ఉన్న గ్రామాలకు నిధులు రావడం లేదు, ఏమి చేయాలో అర్థం కావడం లేదని చెప్పారు. గ్రామ జనాభాలో ఒక్కొక్కరికి రూ.1670 చొప్పున లెక్కేసి ఆ గ్రామ పంచాయతీకి నిధులు ఇస్తారు, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సగం, 15వ ఆర్థిక సంఘం నుంచి సగం ఇవ్వడం జరుగుతోంది. భద్రాచలం కొత్తగూడెం జిల్లాలో దొంగతూడు అనే గ్రామ పంచాయతీ ఉంది, అక్కడ జనాభా 1006 మంది. 40 ఇళ్లు ఉంటాయి. ఇదే జిల్లాలో అడవి రామారం గ్రామ పంచాయతీ ఉంది, అక్కడ జనాభా 107 మంది. 30 ఇళ్లు మాత్రమే ఉంటాయి. నల్లగొండ జిల్లాలో బృందావనపురం గ్రామ పంచాయతీలో 109 మంది జనాభా ఉంటారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చింతల తనాలి లో 126 మంది ఉంటారు. జగిత్యాల జిల్లా చిన్నకొల్వాలిలో 136 మంది ఉంటారు. లెక్క ప్రకారం ఈ గ్రామాలకు ఒక లక్ష, రెండు లక్షలు మాత్రమే వస్తున్నాయి. చిన్న చిన్న తండాలు, కోయ వాళ్లుండే చోట ఏమి చేయాలని అడిగితే, ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి కనీసం రూ.5లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వడం జరుగుతోందనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. 500 జనాభా కంటె తక్కువ వున్న గ్రామ పంచాయతీలు 899 ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రూ.5 లక్షల చొప్పున ఇవ్వడం జరుగుతోంది. లాక్ డౌన్ సందర్భంగా మీ అందరి రిప్రజెంటేషన్ మేరకు 40 వేల మంది గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సెంటివ్ క్రింద ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇవ్వడం జరిగింది. రెండు నెలల్లో రూ.43 కోట్లు ఇవ్వడం జరిగింది.

పల్లె ప్రగతి ద్వారా ఎన్ని విజయాలు మనం సాధించామో ఒకసారి మనందరమూ గుండెల మీద చెయ్యి వేసుకొని రాజకీయాలను ప్రక్కన పెట్టి ఆలోచించాలని నేను అన్ని

రాజకీయ పార్టీలను కోరుతున్నాను. పల్లె ప్రగతి కార్యక్రమం ముఖ్యమంత్రి గారి ఆలోచన. కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడమే కాకుండా, పేదలు చనిపోతే అంత్యక్రియలకు ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం. చెత్త ఊరి బయట ఎక్కడంటే అక్కడ పడేస్తే ఇబ్బందులు వస్తాయి, దాని కోసం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశాం. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఇచ్చాం. వంద ఓట్లు ఉన్న గ్రామంలో కూడా ట్రాక్టర్ కొనుక్కోమని చెప్పాం. అన్నింటికి ఏర్పాట్లు చేశాం. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్, దానికి తగ్గట్లుగా ఒక ట్యాంకర్ ఏర్పాటు చేసి, ప్రతిరోజు చెత్తను తొలగించేలా, చెట్లకు నీరు పోసేలా ఏర్పాటు చేసే కార్యక్రమం చేశాం. మనం ఎవరమైనా ఊహించామా? ఈరోజు ప్రతి ఊర్లో నర్సరీ ఏర్పాటు చేశాము. ఆ ఊర్లోని ఇళ్లకు, రైతులకు అవసరమైన చెట్లను అక్కడే పెంచమని నర్సరీని పెట్టాము. ఈవిధంగా దేశంలో ఎక్కడా లేదు, మన రాష్ట్రంలో మాత్రమే ఉంది.

ములుగు, భూపాలపల్లి ప్రాంతాలలో విషజ్వరాలు వర్షా కాలంలో విపరీతంగా వచ్చేవి. గత ఐదేళ్లుగా కొత్తగూడెం, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విషజ్వరాలతో చాలా ఇబ్బందులు పడ్డారు. పల్లె ప్రగతి కార్యక్రమం పెట్టిన తర్వాత, మేము చెప్పడం కాదు, కేంద్ర ఆరోగ్యశాఖ రిపోర్టు ఇచ్చింది, విష జ్వరాలు లేకుండా పోయాయని చెప్పారు. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేయడం వల్లే ఇది సాధ్యమైందని వెల్లడించారు. విషజ్వరాలు కరోనాతో కలిస్తే ఘోరమైన పరిస్థితి ఉండేది. పల్లె ప్రగతి ద్వారా విషజ్వరాలను తగ్గించగలిగాము.

కరెంటు విషయం ఒకసారి ఆలోచించండి. గ్రామాలలో విరిగిపోయిన కరెంటు స్తంభాలు, లూజ్ వైర్స్ దర్శనమిచ్చేవి. గతంలో కరెంటు బిల్లులు కట్టలేక గ్రామ పంచాయతీలు ఇబ్బంది పడేవి. పాత బకాయిలు మొత్తం క్లోజ్ చేసి రాష్ట్ర ప్రభుత్వమే కరెంటు బిల్లులు కట్టే ఏర్పాటు చేశాము. గ్రామాలలో మంచి విధానాన్ని ప్రవేశపెట్టారు. మిషన్ భగీరథ ద్వారా 98 శాతం ఇంటింటికి త్రాగునీరిచ్చే కార్యక్రమం చేపట్టడం జరిగింది. గ్రామ పంచాయతీ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకూడదని దాని నిర్వహణ కూడా రాష్ట్ర ప్రభుత్వమే చూస్తోంది. మిషన్ భగీరథకు సంబంధించిన కరెంటు బిల్లు కూడా రాష్ట్రప్రభుత్వమే భరిస్తుంది. ఇంతకు ముందు గ్రామ పంచాయతీలకు వచ్చిన డబ్బంతా మంచినీటి సరఫరాకే ఖర్చు అయిపోయేది. ఇప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా, వచ్చిన డబ్బంతా ఏ గ్రామానికి ఆ గ్రామమే ఖర్చు పెట్టుకునేలా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడం జరిగిందని గుర్తు చేస్తున్నాను.

గౌరవ సభ్యులు ఆత్రం సక్కు గారు మాట్లాడుతూ, గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, శ్మశాన వాటికలు, డంపింగు యార్డులు, రైతు వేదికలు ఏర్పాటు చేయాలని కోరారు. పిఎంజిఎస్‌వై లో పోయినసారి అనుకున్నంతగా రాలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి మన వాటా క్రింద నాలుగు వేల కిలోమీటర్లు మంజూరు కావాలి, కానీ వచ్చింది వెయ్యి కిలోమీటర్లు మాత్రమే. ముఖ్యమంత్రి గారు రెప్రజెంట్ చేశారు, నేను చేశాను. మనకు రావలసిన వాటానే అది, కొత్తగా అదనంగా ఇవ్వమని అడగడం లేదు. వాళ్లు ఇవ్వలేకపోతున్నారు. నాలుగు వేల కిలోమీటర్లు మంజూరైతే ప్రతి గ్రామానికి రోడ్లు వేయవచ్చు, అందుకుని దాని వెంట పడుతున్నాం. పిఎంజిఎస్‌వై అనగానే కేంద్ర ప్రభుత్వ నిధులేనని అనుకుంటారు. కానీ ఆ నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం, మన వాటా 40 శాతం ఉంటుంది. మళ్లీ మెయింటెనెన్స్ మనదే. మనకు రావలసిన వాటా గురించి ఆరు నెలల నుండి అడుగుతున్నాం. వెయ్యి కిలోమీటర్లు మాత్రమే మంజూరు చేశారు, దాంతో కొన్ని గ్రామాలకే రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన. తప్పకుండా కల్పిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు శంకర్ నాయక్‌గారు మాట్లాడుతూ, ఇనుగుర్తిని మండలం చేయాలని కోరారు. ఆల్‌రెడీ ముఖ్యమంత్రిగారు ప్రామిస్ చేసి ఉన్నారు. అది పరిశీలనలో ఉంది. మరి కొన్ని గ్రామాలను గ్రామ పంచాయతీలు

చేయాలని కోరారు. ఎక్కడ అవసరముందో పరిశీలించి రిపోర్టు తయారు చేయమని ముఖ్యమంత్రి గారు చెప్పారు. తప్పకుండా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోతామని తెలియజేస్తున్నాను. శంకర్ నాయక్ గారు ఇంకొక విషయం కూడా చెప్పారు. సిసి రోడ్లు అన్ని నియోజకవర్గాలకు ఇచ్చాము, 31 తేదీ లోపల పూర్తి చేయమంటే చాలా చోట్ల చేయలేదు, 50 శాతం మాత్రమే చేశారు. చాలా వరకు అన్ని గ్రామాలకు రోడ్లు వస్తాయి. ఈ సంవత్సరం మళ్లీ కొన్ని సిసి రోడ్లు టేకప్ చేసే అవకాశం ఉంది. వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, నర్సరీ, ట్రాక్టర్ ఉండి, పరిశుభ్రంగా ఉన్న గ్రామాలకే సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ బిల్డింగుకు రూ.20 లక్షలు ఇవ్వమని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశించడం జరిగిందని తెలియజేస్తున్నాను. ఇవన్నీ ఉంటే తప్పకుండా గ్రామ పంచాయతీ బిల్డింగు, సిసి రోడ్లు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

రాథోడ్ గారు మాట్లాడుతూ, గూడేలలో కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయితీ భవనాలను నిర్మించాలని, మిస్ అయిన తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలని రవీంద్ర నాయక్ కోరారు, అది కూడా పరిశీలిస్తాం.

11.30 ఉ. మండలానికొక లింక్ రోడ్డు అని అడిగారు. సోదరి హరిప్రియ గారు కూడా చాలా మంచి విషయాలు చెప్పారు. ఎస్.సి కాలనీలలో ఉప సర్పంచులది కొంత ఇబ్బంది ఉన్నదని చెప్పారు. సర్పంచులను సతాయించే ఏ ఉప సర్పంచు అయినా సరే సర్పంచిది తప్పుండి సతాయిస్తే ఇబ్బంది లేదు గానీ గ్రామసభలో తీర్మానమైన తరువాత ఉప సర్పంచు పెత్తనం చేసినా, సంతకం పెట్టనన్నా వెనువెంటనే ఉప సర్పచు చెక్ పవర్‌ను తీసివేయమని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఎక్కడైనా ఉప సర్పంచు సతాయిస్తే లేదంటే ఇబ్బందులు పెడుతుంటే నా దృష్టికి తీసుకునిరండి. నేను స్వయంగా ఇప్పటివరకు పది మంది ఉప సర్పంచుల చెక్ పవర్‌ను తొలగించడమే కాకుండా వార్డు మెంబరు నుంచి కూడా తొలగించడం జరుగుతుంది. ఏ గ్రామంలో అయితే కార్యదర్శి లేడో ఆ గ్రామంలో వెనువెంటనే కార్యదర్శిని నియమించాలని కలెక్టర్లకు ఇప్పటికే ముఖ్యమంత్రి గారు ఆదేశించడం జరిగింది. దాదాపు 99 శాతం కార్యదర్శుల నియామకం పూర్తయింది. ఒకవేళ ఎక్కడైనా ఏ గ్రామంలోనైనా కార్యదర్శి లేకపోతే నా దృష్టికి తీసుకొస్తే వారం రోజులలో సంబంధిత కలెక్టరును ఆదేశించి కార్యదర్శిని నియమించడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ :- సమయం 11.30 అయింది. ఇప్పటివరకు కేవలం మూడు ప్రశ్నలు మాత్రమే పూర్తయ్యాయి. From now onwards single suplementary.

ప్రశ్న నెం. 357

సర్వశ్రీ తూర్పు జయప్రకాష్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు. గౌరవనీయులైన వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) సంగారెడ్డి వద్ద వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఎప్పటిలోగా దీనిని ఏర్పాటు చేయడమవుతుంది?

వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రి (శ్రీ ఈటెల రాజేందర్) :- అ) అవునండీ

ఆ) ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

శ్రీ తూర్పు జయప్రకాష్ రెడ్డి :- అధ్యక్షా, సంగారెడ్డిలో మెడికల్ కళాశాల మంజూరు గురించి సంవత్సరంన్నర క్రితం ఎన్నికల సమయంలో గౌరవ ముఖ్యమంత్రి గారు హామీ ఇవ్వడం జరిగిందని మంత్రి గారికి మరొకసారి మెడికల్ కళాశాల మంజూరు గురించి ప్రశ్న రూపంలో అడిగితే వారు రాతపూర్వకంగా సమాధానం చెప్పినప్పటికీ వారికి గుర్తు చేద్దామని మరొకసారి మాట్లాడుతున్నాను. సంగారెడ్డి ప్రభుత్వానుపత్రిలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని

అడగడానికి ప్రధాన కారణం సంగారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్‌తోబాటు సంగారెడ్డికి సంబంధించిన ప్రభుత్వాసుపత్రిలో నారాయణ్‌ఖేడ్, పటాన్‌చెరువు, నర్సాపూర్ వంటి వాటితోబాటు మిగతా అయిదారు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమర్జెన్సీ కేసులు సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి రావడం జరుగుతుంది.

రెండవది సిద్ధిపేట నియోజకవర్గంలో మెడికల్ కళాశాల మంజూరు ప్రకటించిన తరువాత మంజూరుకంటే ముందు రూ.1000కోట్లు మంజూరుచేసి మెడికల్ కళాశాలకు కావలసిన భవనాలు, స్ట్రక్చర్లు ఏర్పాటు చేసుకున్నట్లుగా సంగారెడ్డి మెడికల్ కళాశాలకు కూడా వెంటనే రూ.1000 కోట్లు మంజూరు చేయాలని కోరుతున్నాను. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో ఇప్పటికే 200 బెడ్స్ ఉన్నాయి. ఇంకా 500 బెడ్స్‌కు సంబంధించిన మంజూరు ఇవ్వాలని మంత్రిగారిని కోరుతున్నాను. ప్రధానంగా మాది బాంబే హైవే అయినందున పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ వరకు ఎమర్జెన్సీ కేసులన్నీ మొదటగా సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికే వస్తాయి. ఒకవేళ సదరు ఆసుపత్రిలో వీలుకాని కేసులను గాంధీ ఆసుపత్రికి పంపిస్తారు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో ఇప్పుడు సి.టి.స్కాన్ లేదు. ఉన్న సి.టి.స్కాన్ రిపేర్‌లో ఉందని, అది ఎన్ని సార్లు రిపేర్ చేయించినా ఫలితం ఉండటం లేదని చెబుతున్నారు. కాబట్టి వెంటనే కొత్త సి.టి.స్కాన్ కొనుగోలు కోసం కోటి రూపాయల యాభై లక్షల మంజూరు ఇవ్వాలని మంత్రిగారిని కోరుతున్నాను. మా దగ్గర వెంటిలేటర్లు, ఆక్సీజన్ పరికరాలున్నప్పటికీ టెక్నీషియన్‌లు లేరు. కాబట్టి మంత్రిగారు దీని గురించి స్పందించాలని కోరుతున్నాను. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో కొంత మంది డాక్టర్లు ఉన్నప్పటికీ ఇంకా డాక్టర్ల కొరత ఉన్నది. హెడ్ నర్సులు, నర్సులు, కాంపౌండర్‌ల కొరత ఉన్నది. ఎందుకంటే సదరు ఆసుపత్రికి రోజుకు 1500 నుంచి 2000 వరకు అవుట్ పేషెంట్లు ట్రీట్‌మెంటు కోసం వస్తుంటారు. నెలకు సుమారు 60వేల మంది అవుట్‌పేషంట్లు సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకుంటుంటారు. నేను ప్రధానంగా మంత్రిగారిని కోరేదేమంటే సంగారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేసే ముందు కళాశాలకు కావలసిన భవనాలు, స్ట్రక్చర్స్ కోసం రూ.1000 కోట్లు మంజూరు చేయడంతోబాటు 500 బెడ్స్ మంజూరు చేయాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి :- అధ్యక్షా, ఇది మునుగోడు మండలంలోని మర్రిగూడెం మండలం సమస్య. ఈ మండలంలో పిహెచ్‌సి అప్‌గ్రేడ్ అయి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అయిపోయి మెడికల్ సిబ్బందిని నియామకం చేయకపోవడం వలన ఇబ్బంది అవుతున్నది. ఈ సమస్య కేవలం నా నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నది. ప్రజల ఆరోగ్యం అన్నింటికంటే ముఖ్యమైనది. కాబట్టి ఉద్యమ నాయకుడైన రాజేందర్ గారు ఇప్పుడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారు, వారు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి అయినందున వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ ఈటల రాజేందర్:- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు స్వయంగా మెదక్ జిల్లాకు సంబంధించిన మాణ్యులు, మెదక్ జిల్లా హెడ్ క్వార్టరైన సంగారెడ్డి సంగతి తమరికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు తమరు, మేమందరం కలిసి తెలంగాణకు మెడికల్ విషయంలో అన్యాయం జరిగిందని అనేక సార్లు ప్రశ్నించిన విషయం కూడా తమరికి తెలుసు.

11.40 ఉ. అందువల్ల తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 50 సంవత్సరాల సమైక్య రాష్ట్రకాలంలో ఒక్కవైద్య కళాశాల కూడా రాలేదు. కానీ, మన రాష్ట్రం అవతరించిన 50 నెలల కాలంలోనే 6 వైద్య కళాశాలలు వచ్చాయి. సిద్ధిపేట, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్ అలాగే కేంద్ర ప్రభుత్వంతో మనం మాట్లాడి మన దగ్గర ఈ.ఎస్.ఐ. వైద్య కళాశాల మరియు ఏయిమ్స్ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఉద్యమ సందర్భంలో మనం కొట్లాడితే రెండు వచ్చాయి. తమరికి తెలుసు తమరి జిల్లా

అయిన నిజామాబాద్ జిల్లాలో ఒకటి, ఆదిలాబాద్ జిల్లాలో మరోటి. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు ఒకటి – నిజాం నిర్మించినటువంటి ఉస్మానియా వైద్య కళాశాల, రెండవది – శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించినటువంటి గాంధీ వైద్య కళాశాల తప్ప, మరోటి రాలేదు.

కానీ, మారిన పరిస్థితులకు అనుగుణంగా డాక్టర్ల సంఖ్య పెరగాల్సిన అక్కెర ఉన్నది. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో చదువుకొని విద్యార్థులు కోట్ల రూపాయలు నష్టపోతున్నారని చెప్పి, అన్ని జిల్లాల్లో మనం ఒక్కొక్క వైద్య కళాశాల ఏర్పాటు చేసుకోవాలని స్వయాన సంకల్పించి గౌరవ ముఖ్యమంత్రి గారే చాలా సందర్భాల్లో చెప్పారు. నాకు తెలిసి 2019 జనవరి 20న ఇదే సభలో గవర్నర్ గారి ప్రసంగంపై చర్చ జరుగుతున్నప్పుడు సభ్యులు తూర్పు జయప్రకాశ్ రెడ్డి గారు కోరినప్పుడు ఈ హామీ ఇచ్చి ఉన్నాం. ఆ హామీకి లోబడి చెప్పేదేమంటే, కేంద్ర ప్రభుత్వం ఈమధ్య కాలంలో జిల్లాలకి ఒక్కొక్క వైద్య కళాశాలను ఇస్తామని ఒక పథకాన్ని తీసుకువచ్చింది. కానీ, ఆయా జిల్లాల్లో వైద్య కళాశాల కావాలని కోరుతున్నప్పుడు ప్రభుత్వ మెడికల్ కళాశాల గానీ, ప్రైవేట్ మెడికల్ కళాశాల ఉండకూడదనే నిబంధన పెట్టింది. దానివల్ల ఆయన అడిగిన సంగారెడ్డి జిల్లాకు ఈ నిబంధన ఫిట్ కాకపోవడం వల్ల దానిని మనం పెట్టలేకపోయాం.

స్వయంగా నేను కరీంనగర్ జిల్లా గురించి కూడా అడిగాను. కానీ, మా కరీంనగర్ జిల్లాలో రెండు ప్రైవేట్ వైద్య కళాశాలలు ఉండడం వల్ల అక్కడ కూడా ఏర్పాటు చేసేందుకు అర్హత లేకపోయింది, అలాగే ఖమ్మం జిల్లాలో కూడా పెట్టడానికి అర్హత లేకపోయింది. భద్రాచలం జిల్లాలో మరియు మంచిర్యాల జిల్లాలో ఒక్కోటి పెట్టుకోవడం జరిగింది. ఎక్కడెక్కడైతే కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి మన దగ్గర మెడికల్ కళాశాలలు లేని ప్రాంతాలున్నాయో అందులో భాగంగా ఈ సంగారెడ్డికి అర్హత లేకపోయింది.

కానీ, గౌరవ ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చి ఉన్నారు కాబట్టి, త్వరలోనే పరిశీలన చేసి దానిని ఫుల్‌ఫిల్ చేసే ఏర్పాటు చేస్తామని చెప్పి తమరి ద్వారా వారికి తెలియజేస్తున్నాను. అలాగే, సభ్యులు రాజగోపాల్ రెడ్డి గారు చెప్పినట్లుగా గతంలో వాస్తవంగా ఒక ఆసుపత్రికి గానీ, ఏదైనా ఒక కార్యాలయానికి గానీ మంజూరునిస్తే అందులో భవనాలకు మాత్రమే మంజూరు ఇచ్చారు తప్ప, ఎప్పుడు కూడా సిబ్బందిని ఇవ్వలేదు. అందులో భాగంగానే వారు చెప్పినట్లుగా 54 ఆసుపత్రులు అప్‌గ్రేడ్ చేయబడి బ్రహ్మాండమైన భవనాలు వచ్చి, మౌలిక సౌకర్యాలు వచ్చాయి. సిబ్బంది లేరని ఏదైతే అన్నారో అది వాస్తవం. మొన్ననే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారు డాక్టర్లని, నర్సింగ్ సిబ్బందిని కలుపుకొని 10వేల మందిని రిక్రూట్ చేసుకోవడం కోసం అనుమతినిస్తే రకరకాల కారణాలతో కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉండడం వల్ల వాటిని పూర్తిగా రిక్రూట్ చేసుకోలేకపోయాం. 10వేలల్లో, ఇప్పటికే 4వేల మందిని తీసుకోగలిగాం. అందులో 2వేల పైచిలుకు డాక్టర్లను తీసుకోవడం జరిగింది.

ఈమధ్య కాలంలో కొవిడ్ సందర్భంగా 5వేల పైచిలుకు సిబ్బందికి మంజూరు ఇచ్చారు. ఈ కొవిడ్ హడావుడి అయిపోయిన తరువాత అందులో మిగిలిపోయినటువంటి 6వేల మంది సిబ్బందిని, అదేవిధంగా కొవిడ్ సందర్భంగా తీసుకున్నటువంటి 5వేల మంది సిబ్బందిని మొత్తం ఈ 11వేల మందిని మనం అనుకున్నట్లుగా ఎక్కడైతే రోగులు ఎక్కువగా ఉండి, డిమాండ్ ఉండి సిబ్బంది లేరో, ఎక్కడైతే నిర్మాణాలు సరిగ్గా లేనటువంటివి ఉన్నయో తప్పకుండా ఆ పని చేసేటువంటి ఏర్పాటు చేస్తాం.

నిన్ననే గౌరవ ముఖ్యమంత్రి గారు సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ గారికి మిగతా సిటీ ఎమ్మెల్యేలకు హామీ ఇవ్వడం జరిగింది. గౌరవనీయులు కెటిఆర్ గారు నేను కలిసి 200 బస్తీ దవాఖానాలు ఇప్పటికే ఓపెన్ చేసుకున్నాము. మిగతా 150 బస్తీ దవాఖానాలు కూడా హైదరాబాద్‌లో ఉండేటువంటి పేద ప్రజానీకానికి కూడా అవసరమయ్యే విధంగా చేసుకుంటాం. ఏది ఏమైనా నిన్ననే ముఖ్యమంత్రి గారు ఒక మాట ఇచ్చారు. వైద్య రంగంలో మనం ఎక్కడున్నామో

ఇప్పుడు అర్థం అయిపోయింది. కాబట్టి, వైద్య రంగంలో సమూలమైన మార్పులు తెచ్చి పేద ప్రజానీకం కార్పొరేట్ ఆసుపత్రులు పోకుండా ఉచితంగా వైద్యాన్ని అందించేటువంటి గొప్పగా సౌకర్యాన్ని కల్పిస్తా, దానికొరకు ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అయినా చేస్తానని చెప్పి వారు నిన్ననే హామీ ఇచ్చారు. కాబట్టి, సభ్యులు కోరినట్లుగా ఇవన్నీ కూడా రాబోయే కాలంలో తప్పకుండా అవుతాయని మనవి చేస్తున్నాను.

వారు చెప్పినట్లుగా రెండు సంవత్సరాలు అవుతుంది ఏమి కాలేదంటే, అధ్యక్షా, ఈ రంగంలో ఎంత చేసినా తక్కువనే అధ్యక్షా. ప్రతి నిత్యం సదురుకోవాల్సిందే, ప్రతి నిత్యం పని చేయాల్సిందే తప్ప ఇది అయిపోయింది అని చెప్పే ఆస్కారం లేదు. కాబట్టి, వారు ఊహించిన పద్ధతిలో తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజానీకానికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడంలో సఫలం అవుతుందని ఆశిస్తున్నాను.

అలాగే సభ్యులు రాజగోపాల్ రెడ్డి గారు కోరినట్లుగా అక్కడ సిటి స్కాన్ ఉంది. కాకపోతే మరమత్తులో ఉంది, దానిని బాగు చేయిస్తాం. అధ్యక్షా, మొన్న గౌరవనీయులు కెటిఆర్ గారు కొవిడ్ సందర్భంగా సిఎస్ఆర్ ఫండ్ క్రింద మాకు ఇప్పటికే 70, 80కోట్లతో యంత్రాలు ఇప్పించారు. వారినే మళ్లీ అడగడం జరిగింది. ఒక నాలుగైదు సిటి స్కానింగ్ మెషీన్స్ గానీ, కొన్ని ఇతరత్రా ఎంఆర్ఐ స్కానింగ్ మెషీన్స్ గాని కావాలని అడిగాము. ఆ విషయంలో కొంత వర్కవుట్ జరుగుతుంది. తప్పకుండా నాలుగైదు సిటి స్కానింగ్ మెషీన్స్ త్వరలోనే సమకూరుస్తామని హామీ ఇస్తున్నాను.

ప్రశ్న నెం.352(11)

శ్రీ గువ్వల బాలరాజు, ఎం.ఎల్.ఏ., గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

అ) రైతులకు సహకారాన్ని పెంచే, ఆధునిక వ్యవసాయ విధానాలపై శిక్షణనిచ్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా ;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ, సహకార & మార్కెటింగ్ శాఖ మంత్రి (శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి) :- అ) అవునండీ.

ఆ) వివరాలను సభా సమక్షంలో ఉండడమయింది.

శ్రీ గువ్వల బాలరాజు :- అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు చెప్పినట్లుగా సమాధానాలు మాకు కొద్దిగా అందాయి. కానీ, ముఖ్యంగా ఆధునిక వ్యవసాయ విధానంలో ఈ రైతు వేదికలను ఏ రకంగా ఉపయోగించుకుంటారో తెలియజేయాలి. ఈ సాంకేతికత అంత కూడా ఆ రైతు వేదికల్లో ఏర్పాటు చేసినట్లయితే రైతుకు మేలు జరిగేటువంటి అవకాశం ఉంటుంది. అదేవిధంగా రైతుబంధు సమితిలను కూడా అద్భుతంగా గౌరవ ముఖ్యమంత్రి గారు రాష్ట్రవ్యాప్తంగా వేయించడం జరిగింది. రైతుబంధు సమితిలల్లో పనిచేస్తున్నటువంటి వారు కూడా ఇప్పటికే చాలా ఉత్సుకతతో మాకు ఇచ్చే బాధ్యతలు ఏముంటాయి, ఏ పని చేయాలి, రైతులకు చేరువ కావాలనేటువంటి ఆలోచనలతో ఉన్నారు. వారి పాత్ర ఏ రకంగా ఉండబోతుంది, వారి సర్వీసెస్ ఏ రకంగా ఉపయోగించుకోబోతున్నారనేది తెలియజేయాలి. అదేవిధంగా రైతు వేదికలల్లో ప్రాజెక్టర్స్ ఏర్పాటు చేస్తారనే ఒక చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి గారు రైతులను అన్ని రైతు వేదికల్లో కూర్చోబెట్టి వీలైనప్పుడల్లా చర్చ జరుపుతారని అక్కడక్కడా వార్తలు వింటున్నాము. నిజంగా కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు వీడియో కాన్ఫరెన్స్‌ను గనుక ఏర్పాటు చేసినట్లయితే, ఎందుకంటే మన ముఖ్యమంత్రి గారు స్వయాన రైతు అని తెలుసు. కాబట్టి, ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి గారి ద్వారా రైతాంగానికి ఏ సమాచారం వెళ్లినా అది విజయం సాధిస్తుంది, రైతులకు మేలు చేకూరుస్తుంది అనేది అందరి ప్రగాఢమైన విశ్వాసం.

ముఖ్యంగా నియంత్రిత సాగు విషయంలో కూడా ముఖ్యమంత్రి గారు అప్పీల్ చేసినట్లుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు

పంటల మార్పిడి విషయంలో వారి ఆదేశాలు పాటించి, అక్కడక్కడా ఇతర పక్షాల వారు కావాలని కొద్దిమందిని రెచ్చగొట్టి వ్యతిరేకత తీసుకువచ్చిప్పటికినీ, రైతులు కేవలం ముఖ్యమంత్రి గారి మాటనే ఆచరిస్తూ ముందుకు పోతున్నారు. ముఖ్యంగా పత్తి సాగు విషయంలో విపరీతంగా పత్తి సాగు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి, దానిని స్టాక్ చేసుకొనేవిధంగా ప్రతి మండలంలో ఉన్నటువంటి గోడౌన్స్ అన్ని కలిపితే దాదాపు 5,000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోడౌన్లను రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి ఆ నిర్మాణాలు చేపట్టడం జరిగింది. అవి సరిపోవడం లేదని రైతుల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. దాని విషయంలో కూడా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపడుతుందో తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి :- అధ్యక్షా, రాష్ట్రంలో 2,604 వ్యవసాయ క్లస్టర్లను గౌరవ ముఖ్యమంత్రి గారు వ్యవసాయ శాఖకు మార్గ నిర్దేశం చేసి ఏర్పాటు చేసిన సంగతి సభ్యులకు, రాష్ట్ర రైతాంగానికి తెలుసు. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఉండేటువంటి ఒక వ్యవసాయ క్లస్టర్‌లో రైతాంగం మొత్తాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒక సంఘటిత శక్తిగా మార్చుకోవడం కోసం వీటిని ప్రాథమిక యూనిట్లుగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అక్కడ వాళ్లకు రైతు వేదికలను ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి బడ్జెట్‌లో నిధులను కేటాయించి ఒక్కొక్కటి రూ.22లక్షలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 2604 రైతు వేదికల నిర్మాణం చేస్తున్నాం. మరో నెల రోజుల్లో సామూహికంగా రైతు వేదికలను ప్రారంభించుకోబోతున్నాం. చాలా అద్భుతంగా నిర్మాణాలు సాగుతున్నాయి. వీటి ఉద్దేశం ఒకటే – ఒకవైపు రైతుబంధు సమితుల ద్వారా రైతులను సంఘటితం చేయడానికి స్ట్రక్చరల్‌గా ఒక ఆర్గనైజేషన్‌ని బిల్డప్ చేస్తున్నాం. మరోవైపు రైతు వేదికల నిర్మాణం చేసి ఆధునిక సాంకేతికతను దానికి జోడించి మారుమూల ప్రాంతాల్లో ఉండేటువంటి రైతాంగం అంతటితో నేరుగా సాక్షాత్తు ముఖ్యమంత్రి గారు గానీ, వ్యవసాయ శాఖ మంత్రి గారు గానీ, ఇతరత్రా ఉన్నతాధికారులు ఎవరు మాట్లాడాలనుకున్నా, వ్యవసాయ శాఖకు సంబంధించిన ఉద్యోగులతో సంభాషించదలచుకున్నా, ఏ సమాచారం అయినా వాళ్లకు చేరవేయడం కోసం ఈ ఆధునిక సాంకేతికతను జోడించి ఆయా రైతు కేంద్రాల ద్వారా, రైతు వేదికల ద్వారా సమాచారాన్ని విస్తరింపచేయడం.

ఇప్పటికే మనకు అందుబాటులో ఉన్నటువంటి వ్యవసాయ శాఖ కమీషనరేట్ ద్వారా విస్తరణ కార్యక్రమం చేపడుతున్నాం. దానిని Agricultural Extension Activity అంటాం. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా వ్యవసాయ విద్యా, వ్యవసాయ పరిశోధన, వ్యవసాయ విస్తరణ మూడు విభాలుగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా ఉంటుంది. దీంతోపాటు Agricultural Training Management ద్వారా మనం నిరంతరం ఇచ్చేటువంటిది ఉంటుంది. ఇవి కాక ఇప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నటువంటిది రైతు వేదికల ద్వారా ఏమి చేయబోతున్నామంటే, వ్యవసాయం మొత్తం సమగ్రంగా అమలు జరగడం కోసం అవసరమైనటువంటి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం. రైతంగానికి దిన వారీగా ఏరోజుకారోజు అవసరమైనటువంటి సూచనలు, సలహాలు అందించడం.

అలాగే నీటి యాజమాన్య కొలతలు కావచ్చు, గ్రామాల్లో వాతావరణంలో వచ్చేటువంటి మార్పులు కావచ్చు, వ్యవసాయ వస్తువుల ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థలు కావచ్చు, పురుగు మందులు, పిచికారీలో వచ్చే భద్రతా చర్యలు కావచ్చు, జీవ సంబంధ నియంత్రికలు కావచ్చు, వ్యవసాయంలో వాటి ఆవశ్యకత. అదేవిధంగా కలుపు నివారణ, స్థిరమైన పంటల ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వరిలో నేరుగా విత్తనాలు వేసేటువంటి స్ప్రెడ్డింగ్ అంటాం అధ్యక్షా, నాట్లు వేసి కలుపులు తీయడం కాకుండా నేరుగా వరి విత్తనాలను స్ప్రెడ్ చేసి వేసేటువంటి విధానం కావచ్చు. వాతావరణ వైపరీత్యాలకు సంబంధించినటువంటి అంశాలు. విపత్తులను నిర్వహించుకునేటువంటి విధానం. స్థిరమైన వ్యవసాయం

కోసం వర్షాధార పంటల ఉత్పత్తి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం. నీటి వినయోగాన్ని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవడం. పంటలను కోసే విధానం (Harvesting Mechanism), పంటలను చేతికి తెచ్చుకొని మార్కెటింగ్ చేసే విధానం. వీటన్నింటిల్లో ఒక సమగ్రమైనటువంటి శిక్షణను రైతంగానికి ఇవ్వాలంటే, వ్యవసాయ శాఖ సర్వ సన్నద్ధమై రైతంగానికి శిక్షణను ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.

11.50 ఉ. ఈ రకంగా మొత్తం అన్ని వ్యవస్థలను రైతు వేదికలు కేంద్రాలుగా , రైతుబంధు సమితుల యొక్క నేతృత్వంలో రాష్ట్రంలో నిర్వహింపబడాలని వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ధన్యవాదాలు.

ప్రశ్న నెం. 432(12)

శ్రీ అంజయ్య యెల్గనవెోని, ఎం. ఎల్.ఏ. గౌరవనీయులైన ఇంధన శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు శాఖలో జె.ఎల్.ఎం. పదవుల నియామక ప్రక్రియను ప్రారంభించిన విషయం వాస్తవమేనా;

(ఆ) ఈ శాఖలో ప్రమాద బాధిత ఉద్యోగులకు ఒక అవకాశం ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

(ఇ) సబ్‌స్టేషన్ల నిర్మాణం, స్తంభాలను వేయడానికి భూములను ఇచ్చిన వారికి అవకాశం ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

(ఈ) ఎ.బి. స్విచ్‌ల కొరత వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్న విషయం వాస్తవమేనా;

(ఉ) అయితే, ట్రాన్స్‌ఫార్మర్లన్నింటికి ఎ.బి. స్విచ్‌లను బిగించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

ఇంధన శాఖ మంత్రి (శ్రీ గుంటకండ్ల జగదీష్ రెడ్డి):-

(అ) అవునండీ.

(ఆ) అవునండీ.

(ఇ) లేదండీ.

(ఈ) లేదండీ.

(ఉ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ వై.అంజయ్య :- అధ్యక్షా, గతంలో వ్యవసాయదారుల పరిస్థితి ఏ విధంగా ఉండేదో మనందరికీ తెలిసిందే. వ్యవసాయదారులు బాగుపడాలంటే ఏమి అవసరమో గౌరవ ముఖ్యమంత్రిగారు ఆలోచించారు. దాని ఫలితమే నేడు రైతులకు సమృద్ధిగా నీరు, ఇరవై నాలుగు గంటల కరెంటు,పెట్టుబడిసహాయం రైతులకు కల్పించాలనే ఉద్దేశంతో ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ వస్తే చీకటవుతుందని ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగారు చెప్పిన విషయం అందరికీ గుర్తే. ఆనాడు రైతులకు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. రాత్రి వేళల్లో పొలానికి వెళితే పాములు కరిచి, కరెంటు షాక్‌కి గురై చనిపోయిన సందర్భాలున్నాయి. రోజుల తరబడి తిరిగినా కరెంటు వచ్చేది కాదు. కాని నేడు ఆ పరిస్థితి లేదు. రైతుకి 24 గంటల కరెంటు అందుబాటులోకి వచ్చింది. చాలామంది రైతులు సంతోషంగా ఉన్నారు. వారి పరిస్థితి ఎంతో బాగుపడింది.

ఈ సందర్భంగా గౌరవ మంత్రిగారిని నేను కోరేది ఏమిటంటే కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఎ.బి. స్విచ్‌ల కొరత వలన, ఇళ్లలోగాని, పొలాల్లోగాని వైర్లు ఊడిపోవడం వలన చాలామంది అకాల మరణం చెందుతున్నారు. కొంతమంది ప్రమాదానికి గురై, మంచానపడి ఉన్నారు. వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయి కాబట్టి, దయచేసి ఎ.బి. స్విచ్‌లు తగినన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని నేను కోరుతున్నాను.

అదే విధంగా విద్యుత్తు శాఖలో ప్రమాదాలకు గురైన వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మా నియోజకవర్గంలో అనేక చోట్ల లో- ఓల్టేజి వలన

ట్రాన్స్‌ఫారాలు కాలిపోతున్నాయి. విద్యుత్తుశాఖ అధికారులు కరెంటు స్తంభాలు వేసే ప్రక్రియలో భాగంగా ఒక వ్యక్తి దగ్గర ఉన్న మూడు ఎకరాల పొలాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని అతని పొలం తీసుకున్నారు. ఇటు నష్టపరిహారం ఇవ్వలేదు, అటు ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఆ కుటుంబానికి చెందిన యువకుడు పరీక్ష రాస్తే నాలుగు మార్కులు తక్కువ వచ్చాయని తెలిసింది. కాబట్టి ఈ విషయంలో ఆ రైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తారా, లేక ఉద్యోగం కల్పిస్తారా అనేది ఆలోచించవలసిందిగా కోరుతున్నాను. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాధికులైన పిల్లలు చాలామంది ఖాళీగా ఉన్నారు. వారు పోల్స్ వేయడానికి విద్యుత్తు శాఖకు తమ పొలాలు ఇచ్చి, సహకరించారు కాబట్టి, స్థానికులకు తగు రీతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జి. జగదీష్ రెడ్డి :- అధ్యక్షా, గౌరవ సభ్యులు ఉద్యోగాల గురించి అడిగారు. ఇప్పటికే ఎన్‌పిడిసిఎల్ పరిధిలో 2,284 మంది జెఎల్‌ఎంలను నియమించడం జరిగింది. అదే విధంగా ఎస్‌పిడిసిఎల్ పరిధిలో 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాము. వాటి పరిశీలన కూడా పూర్తయింది. త్వరలోనే ఎంపికైనవారికి నియామకపు ఉత్తర్వులు ఇస్తాము. గౌరవ శాసన సభ్యులు అడిగినట్లుగానే ఏ జిల్లావారికి ఆ జిల్లాలోనే ఉద్యోగాలు ఇస్తాము. అలాగే వారు చనిపోయిన వారి కుటుంబాలకు సంబంధించి ఉద్యోగాలు ఇవ్వడానికి ఈ నోటిఫికేషన్‌లో దానిని చేర్చవలసిన అవసరం లేదు. డిపార్టుమెంటులో పని చేస్తూ, ఏ ఉద్యోగి చనిపోయినా, వెంటనే రెండు,మూడు నెలల్లోనే వారి కుటుంబంలో అర్హత కలిగిన వారు ఎవరుంటారో వారికి ఉద్యోగం ఇస్తున్నాము. ఇది నిరంతరంగా జరుగుతున్నది. ఎక్కడా పెండింగ్‌లో లేదు. అలాగే డిపార్టుమెంటుకి భూమి ఇచ్చిన వారి గురించి, చాలామంది మిత్రులు కూడా అడుగుతున్నారు. వాస్తవానికి వారు భూమి ఇచ్చే సమయంలో నష్టపరిహారం తీసుకోకుండా ఉండి, వారికి ఉద్యోగం ఇచ్చే ప్రాతిపదికను భూమిని ఇచ్చినట్లయితే, ఆ కుటుంబంలో అర్హత కలిగి ఎవరైతే ఉన్నారో వారికి ఉద్యోగం కల్పించే విషయంలో చర్యలు తీసుకోవాలని నేను ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాను. మా అధికారులు అదే పనిలో ఉన్నారు.

కాబట్టి వారి భూమిని నష్టపరిహారం కోరకుండా, భూమి ఇచ్చేటప్పుడే మా ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎవరైతే అగ్రిమెంటు రాసిచ్చారో వారందరికీ తప్పకుండా ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుంది. అదే విధంగా ఎ.బి. స్విచ్‌ల కొరత గురించి మాకు ఎప్పుడూ ఫిర్యాదులు అందలేదు. చాలాచోట్ల ఎర్తింగ్ లేకపోవడం వల్ల, కొన్ని అజాగ్రత్తల వల్ల అక్కడక్కడా కొంతమంది చనిపోతున్న విషయం వాస్తవమే. కనీస జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వాళ్ల ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది. కరెంటు పనులు చేసేవాళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పనులు చేసేవాళ్లు , స్తంభాలు ఎక్కేవాళ్లు కావచ్చు లేదా ఇళ్లలో చిన్నచిన్న రిపేర్లు చేసుకునేవాళ్లు కావచ్చు, వాళ్లంతా గ్లౌజులు లేకుండా, షూస్ లేకుండా, ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా , రక్షణ చర్యలు పాటించని వాళ్లే మరణిస్తున్నారు. దయచేసి ఈ విషయంలో అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను. గౌరవ శాసనసభ్యులు కూడా పర్యటనల సందర్భంగా ఈ విషయాల గురించి చెప్పవలసిన అవసరం ఉంది. నా నియోజకవర్గంతో పాటు, ఇతర జిల్లాల్లో కూడా విద్యుత్తు షాక్‌తో మరణించిన వారిని చూసేందుకు వెళ్లినప్పుడు ఇందులో పూర్తి అజాగ్రత్తే ఉంటుంది తప్ప, మరో కారణం ఉండదు. ఇళ్లలో టి.వి. రిపేర్ చేస్తూ చనిపోతున్న సందర్భాలను మనం చూస్తున్నాము. కరెంటు స్టాలు రిపేర్ చేస్తూ చనిపోయిన సంఘటనలు మనం చూస్తున్నాము. వ్యవసాయ బావుల దగ్గర సర్వీసు వైర్ కేబుల్ తెగిపోతే, చూసుకోకుండా, దాన్ని పట్టుకుని, చనిపోయిన వార్తలు మనం చదువుతున్నాము. పోల్స్ ఎక్కే సమయంలో కూడా, ముందుగా సరైన సమాచారం ఇవ్వకుండా, వారికి వారే ఎ.బి. స్విచ్ బంద్ చేసి పోవడం, పోల్ ఎక్కడం, అక్కడ ఎవరూ కాపలా లేకపోవడం, తరువాత మరొకరెవరో వచ్చి, స్విచ్ బంద్ చేసి వెళ్లారని, ఆయన ఆ స్విచ్ వేయడం...ఈ

రకమైన ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. కాబట్టి ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలి. అప్రమత్తంగా ఉండాలి. ఎవరి ప్రాణం వారికే విలువైంది కాబట్టి ఈ రకంగా కరెంటు పనులు చేసే వాళ్లు భద్రతగా ఉండాలి. ఎ.బి. స్విచ్‌లు లేకపోవడం అనే సమస్య లేదు. సరైన పద్ధతిలో వాటిని వినియోగించుకోకపోవడం వల్ల, అజాగ్రత్తగా ఉండడవం వల్ల ఎక్కువ మంది చనిపోతున్నారు. ఆ విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఉద్యోగాలు మాత్రం స్థానికులకే ఇస్తాము. ఏ జిల్లాకు సంబంధించిన వారికి ఆ జిల్లాలోనే ఉద్యోగాలు కల్పిస్తున్నాము.

వాయిదా ప్రతిపాదన

మిస్టర్ స్పీకర్ :- గౌరవనీయులు వుల్లు భట్టివిక్రమార్కగారు మరియు ఇతరులు ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో గత కొన్ని మాసాలుగా ఏ రకమైన ఆపరేషన్లు చేయనందువల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల గురించి చర్చించాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

جناب اسپیکر (MR.SPEAKER) کی جگہ نہیں بیٹھنا چاہئے۔ نشستوں پر جو لکھا ہے "No Seating" لگایا گیا ہے۔ اس جگہ بیٹھنا آپ کے لئے بھی اچھا نہیں رہتا اور بات کرنے والوں کے لئے بھی اچھا نہیں رہتا۔ دونوں کے لئے بھی تھوڑی زحمت ہوتی ہے۔ مہربانی کیجئے۔

Now, Tea-break for 10 minutes.

(పది నిమిషాల టీ విరామం కొరకు మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదా పడింది)

12.20 మ.

(The House Re-assembled at 12.20 PM)

(Hon'ble Speaker in the Chair).

MR.SPEAKER :- Please resume your seats. Now, I will take up the Government Bills.

GOVERNMENT BILLS

The Telangana State Private Universities (Establishment and Regulation) (Amendment) Bill, 2020

MR.SPEAKER :- I request the Minister for Education to move the Motion to introduce the Telangana State Private Universities (Establishment and Regulation) (Amendment) Bill, 2020.

SMT.P.SABITHA :- Speaker Sir, I beg to move:

"That leave be granted to introduce the Telangana State Private Universities (Establishment and Regulation) (Amendment) Bill, 2020."

MR.SPEAKER :- Motion moved. The question is:

"That leave be granted to introduce the Telangana State Private Universities (Establishment and Regulation) (Amendment) Bill, 2020."

(PAUSE)

The Motion was carried and the Bill was introduced.

The Telangana Disaster and Public Health Emergency (Special Provisions) Bill, 2020.

MR.SPEAKER :- I request the Minister for Municipal Administration and Urban Development on behalf of the Finance Minister to introduce the Telangana Disaster and Public Health Emergency (Special Provisions) Bill, 2020.

SRI K. TARAKA RAMA RAO (MINISTER FOR MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOP-MENT) (DEPUTIZING THE MINISTER FOR FINANCE): Speaker Sir, I beg to move:

"That leave be granted to introduce the Telangana Disaster and Public Health Emergency (Special Provisions) Bill, 2020."

MR.SPEAKER :- Motion moved. The question is:

"That leave be granted to introduce the Telangana Disaster and Public Health Emergency (Special Provisions) Bill, 2020."

(PAUSE)

The Motion was carried and the Bill was introduced.

The Telangana Public Employment (Regulation of Age of Superannuation) (Amendment) Bill, 2020

MR.SPEAKER :- I request the Minister for Municipal Administration and Urban Development on behalf of the Finance Minister to introduce the Telangana Public Employment (Regulation of Age of Superannuation) (Amendment) Bill, 2020

SRI K. TARAKA RAMA RAO (MINISTER FOR MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT) (DEPUTIZING THE MINISTER FOR FINANCE):- Speaker Sir, I beg to move:

"That leave be granted to introduce the Telangana Public Employment (Regulation of Age of Superannuation) (Amendment) Bill, 2020

MR.SPEAKER:- Motion moved. The question is:

"That leave be granted to introduce the Telangana Public Employment (Regulation of Age of Superannuation) (Amendment) Bill, 2020

(PAUSE)

The Motion was carried and the Bill was introduced.

The Telangana Fiscal Responsibility and Budget Management (Amendment) Bill, 2020.

MR.SPEAKER :- I request the Minister for Municipal Administration and Urban Development on behalf of the Finance Minister to introduce the Telangana Fiscal Responsibility and Budget Management (Amendment) Bill, 2020.

SRI K. TARAKA RAMA RAO (MINISTER FOR MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT) (DEPUTIZING THE MINISTER FOR FINANCE) :- Speaker Sir, I beg to move:

"That leave be granted to introduce the Telangana Fiscal Responsibility and Budget Management (Amendment) Bill, 2020."

MR.SPEAKER:- Motion moved. The question is:

"That leave be granted to introduce the Telangana Fiscal Responsibility and Budget Management (Amendment) Bill, 2020."

(PAUSE)

The Motion was carried and the Bill was introduced.

MR.SPEAKER :- Now, I will take up Zero Hour.

జీరో అవర్

డా. వి. ఎమ్. అబ్రహాం :- అధ్యక్షా, నా ప్రశ్న రోడ్లు మరియు భవనాల మంత్రిగారికి సంబంధించినది. దాదాపు 12 సంవత్సరాల నుండి తుంగభద్ర నదిపైన ఒక బ్రిడ్జి కడుతున్నారు. ఆ బ్రిడ్జి 95 శాతం పనులు పూర్తి అయిపోయాయి. కేవలం 5 శాతం పనులు మాత్రమే జరగాల్సి ఉంది. అది కూడా అప్రోచ్ రోడ్డు పనులు మాత్రమే పూర్తి కావాల్సి ఉంది. దాని నుండి ఇంటర్ స్టేట్ కనెక్షన్ వస్తుంది మరియు శ్రీశైలం వెళ్లడానికి, జోగులాంబ గద్వాలకు వెళ్లడానికి దాదాపు 50 నుండి 60 కిలో మీటర్ల దూరం వరకు వెళ్లడానికి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యంగా ఉంటుంది. కాబట్టి, ఆ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారు? మిగిలిపోయిన 5 శాతం పనులు పూర్తి కావడానికి ఇంచుమించు 35కోట్ల రూపాయల అవసరం ఉంటుంది. సత్వరమే ఆ పనులు పూర్తి చేయించి ముఖ్యమంత్రిగారు ప్రారంభించాలని వారిని కోరుతున్నాను. దాదాపు ఒక సంవత్సరం నుండి ప్రయత్నం చేస్తున్నాను. కానీ, ఆ పనులు ఇప్పటి వరకు పూర్తి కావడంలేదు. ఈ విషయంలో ఇఎన్‌సిగారితో మంత్రిగారు సమీక్షించడం కూడా జరిగింది. కాబట్టి, ఈ పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరుతున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి :- అధ్యక్షా, గౌరవ సభ్యులు డా. వి. ఎమ్. అబ్రహాం గారు ప్రస్తావించిన అంశాన్ని నోట్ చేసుకున్నాను.

శ్రీ బి. కృష్ణమోహన్ రెడ్డి :- అధ్యక్షా, జూరాల, నెట్టంపాడు ప్రాజెక్టులు మా నియోజకవర్గంలో ఉన్నాయి. రిహాబిలిటేషన్ పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. నెట్టంపాడు ప్రాజెక్టు పనులు జరిగితే, రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ప్రస్తుతం ఒక లక్షా, ముప్పై వేల ఎకరాలకు మాత్రమే నీరు అందించడం జరుగుతుంది. పూర్తి స్థాయిలో కాలువల పనులు జరగలేదు. రిజర్వాయరు నుండి కూడా 12 టి.ఎమ్.సి.ల నీళ్లు తీసుకునే అవకాశం మనకు ఉంది. మనకు ఉన్న ఏడు రిజర్వాయర్లలో ఐదు రిజర్వాయర్లు పూర్తి అయ్యాయి. మిగిలిన రెండు రిజర్వాయర్లు పూర్తి కాలేదు. ఈ కారణంగా మేము 10 టి.ఎమ్.సి.ల నీరు మాత్రమే తీసుకోగలుగుతున్నాము. నీటిపారుదల కార్యదర్శిగారు ఈ విషయమై పూర్తి స్థాయిలో రెవ్యూ చేసి నివేదికను ముఖ్యమంత్రిగారికి సమర్పించాలని కోరుకుంటున్నాను.

శ్రీ టి. శ్రీనివాస్ యాదవ్ :- అధ్యక్షా, గౌరవ సభ్యులు బి. కృష్ణ మోహన్‌రెడ్డిగారు లేవనెత్తిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

(JANAB AHMED BIN ABDULLAH BALALA, MALAKPET CONSTITUENCY) :جناب احمد بن عبداللہ بلعلہ

اسپیکر صاحب! میں آپ کے ذریعہ حکومت اور وزیر بلدیہ سے یہ کہنا چاہتا ہوں کہ موسیٰ ندی کی صفائی کے پراجیکٹ کا کام تیزی سے شروع کرنے کی ضرورت ہے۔ سب سے پہلی بات تو یہ ہے کہ موسیٰ ندی صرف نالہ یا پرنالہ وغیرہ جیسا کوئی کام نہیں ہے، بلکہ موسیٰ ندی وقار آباد کے قریب سے شروع ہوتی ہے۔ تو کیا موسیٰ ندی کی صفائی کے پراجیکٹ کا کام وہاں سے شروع ہو رہا ہے یا صرف یہاں سے؟ چونکہ آج لوگ وبائی امراض کی وجہ سے پریشان ہیں، اس لئے میں خاص طور پر یہ کہوں گا کہ اس پراجیکٹ کا کام تیزی سے شروع کیا جائے۔ موسیٰ ندی کا روان سے بھی گزرتی ہے لیکن وہاں پر بھی صفائی کا اہتمام نہیں ہے۔ اسی طرح حلقہ اسمبلی ملک پیٹ کے بارے میں بھی لوگوں سے موسیٰ ندی گزرتی ہے۔ تو میری آپ سے گزارش ہے کہ جلد سے جلد اس کی باؤنڈری کو طے کیا جائے تاکہ اگر غریب لوگ پہلے سے وہاں پر موجود ہیں، تو ان کی بازآبادکاری کی جا سکے۔ موسیٰ ندی کا ایک اچھے طریقے سے پروگرام بنا کر اس کو صاف کیا جائے۔ اس کی گندگی کی وجہ سے کئی بیماریوں کا خدشہ ہے۔ حکومت کی جانب سے ایک کمیٹی بنائی گئی ہے لیکن میں منسٹر صاحب سے گزارش کروں گا کہ تمام ایم ایل ایز کی ایک میٹنگ طلب کر کے اس کام کو تیزی سے آگے بڑھایا جائے اور موسیٰ ندی کو صاف ستھری اور خوبصورت بنایا جائے تاکہ اطراف و اکناف کے لوگوں کی صحت پر موسیٰ ندی کی وجہ سے جو اثر ہو رہا ہے، اس کو ختم کیا جا سکے۔ چونکہ تمام مفصلہ آکر موسیٰ ندی میں مل رہا ہے، جس کے بارے میں منسٹر صاحب بخوبی واقف ہیں، میں کہوں گا کہ آپ وہاں پر جگہ جگہ سیوریج ٹریٹمنٹ پلانٹس قائم کر کے صفائی کے تمام کاموں کو جتنا جلدی ہو سکے کروائیے۔ آج یہ وقت کی اہم ضرورت ہے۔ میں آپ سے دردمندی سے کہنا چاہتا ہوں کہ موسیٰ ندی کی وجہ سے کئی علاقے تباہ ہو رہے ہیں۔ آپ مہربانی کر کے اس کی صفائی کیجئے، اس کی باؤنڈری طے کیجئے، وہاں پر جو غریب لوگ قابض ہیں، ان کو متبادل جگہ فراہم کیجئے اور تیزی سے اس کام کو آگے لے جائیے۔ شکریہ۔

(JANAB K.TARAKA RAMA RAO) :جناب کے۔ تارکا رامارؤ

اسپیکر صاحب! جناب احمد بن عبداللہ بلعلہ صاحب نے موسیٰ ندی کی صفائی اور اس کو خوبصورت بنانے کا جو مسئلہ اٹھایا، حکومت اس پر غور کر رہی ہے۔ اس کو نوٹ کیا جائے گا اور جلد سے جلد اس کام کو شروع کیا جائے گا۔

శ్రీ ఆరూరి రమేష్:- అధ్యక్షా, నా ప్రశ్న గౌరవ మున్సిపల్ శాఖామంత్రిగారికి సంబంధించినది. గ్రేటర్ వరంగల్ కావడానికి 31 గ్రామాలు నా నియోజకవర్గం నుండి మరియు పరకాల, ఘన్‌పూర్ మొదలగు 11 గ్రామాలను కలిపి మొత్తం 42 గ్రామాలను గ్రేటర్ వరంగల్‌గా చేయడం జరిగింది. గతంలో జరిగిన నిర్లక్ష్యం వలన ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రత్యేక దృష్టి సారించి కొన్ని నిధులు, గౌరవ మున్సిపల్ శాఖా మంత్రిగారు కొన్ని నిధులు వెచ్చించడం జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని రోడ్లు మరియు డ్రైనేజి సిస్టమ్ దెబ్బ తిన్నాయి. మున్సిపల్ చట్టంలో విలీన గ్రామాలకు పెద్ద పీట వేయాలని అన్నారు. అది ఎలాగూ చేస్తారు. కాబట్టి, గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న 42 గ్రామాల అభివృద్ధి కోసం గౌరవ మంత్రిగారు ప్రత్యేకంగా హామీ ఇస్తూ, సమాధానం ఇస్తారని కోరుకుంటున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్షా, గౌరవనీయులు ఆరూరి రమేష్‌గారు వరంగల్ కార్పొరేషన్‌లో విలీనమైన 42

గ్రామాల అభివృద్ధి గురించి ప్రస్తావించిన అంశాన్ని తప్పకుండా పరిశీలిస్తాము.

12.30 మ. **శ్రీ జి.జైపాల్ యాదవ్** :- అధ్యక్షా, నా నియోజకర్గం కల్వకుర్తిలోని తలకొండపల్లి మండలంలో బెలిజాల, రఘుపతిపేట గ్రామాలు ఉన్నాయి. కొత్తగా మండలాలు ఏర్పాటుచేసే క్రమంలో రెండు గ్రామాలకు సంబంధించిన విజ్ఞాపన పత్రం గౌరవ ముఖ్యమంత్రిగారికి ఇవ్వడం జరిగింది. అవి ప్రాసెస్‌లో ఉన్నాయి. తలకొండపల్లి మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉన్నాయి. దాని చుట్టుప్రక్కల ఉరుకొండ, మెర్జీల్, ఆమనగల్ మండలాలు ఉన్నాయి. అక్కడ ఒక మండల కేంద్రంగా ఏర్పాటు కావల్సిన అవసరం ఎంతో ఉన్నది. రఘుపతిపేట గ్రామం దుందుబి నది పక్కకు ఉన్నది. అక్కడ నుంచి తెలకపల్లి మండలం, లింగాల మండలం, అచ్చంపేటకు సంబంధించిన వంగూరు మండలం నాగర్‌కర్నూలు, కల్వకుర్తికి సంబంధించిన గ్రామాలు కలుపుకుంటే అక్కడికి ఆ ప్రాంతం సుదూర ప్రాంతం, కల్వకుర్తికి చాలా దూరంగా ఉంది. కాబట్టి అక్కడ ఒక మండల కేంద్రం ఏర్పాటు కావాలని గౌరవ ముఖ్యమంత్రిగారికి రెప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. అది ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. గౌరవ మంత్రివర్యులు కేటీఆర్ గారు, పంచాయతీరాజ్ శాఖా మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావుగారు కూడా సభలో ఉన్నారు. కాబట్టి, దయచేసి ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యమైన అంశంగా గుర్తించి రెండు గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి :- గౌరవ శాసనసభ్యులు జైపాల్ యాదవ్‌గారు తన నియోజకవర్గంలో కొత్త మండలాల ఏర్పాటు గురించి అడగడం జరిగింది. దానిని నోట్ చేసుకున్నాను.

(గౌరవ ఉపసభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

శ్రీ ఆర్.రవీందర్ కుమార్ :- అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం మొత్తం వర్షాకాలంలో విస్తారమైన వర్షాలు పడి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు అన్నీ నిండి పొంగిపొర్లుతుంటే విచిత్రమేమిటో కానీ దేవరకొండ నియోజకవర్గంలో ఏ చెరువులోనైనా, ఏ కుంటలోనైనా నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి చలువతో డిండి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడం జరిగింది. రిజర్వాయర్లు, కాలువలు వాటికి సంబంధించిన పనులు కొన్ని పూర్తయ్యాయి. నా నియోజకవర్గంలో సింగరాజుపల్లి , గొట్టిముక్కల, చింతపల్లి, క్రిష్ణాయినపల్లి రిజర్వాయర్లను చేపట్టడం జరిగింది. గొట్టిముక్కల రిజర్వాయర్లకు సంబంధించి దాదాపు 80శాతం పనులు పూర్తి అయ్యాయి. సింగరాజుపల్లి రిజర్వాయర్లకు సంబంధించి సుమారు 85శాతం పనులు పూర్తి అయ్యాయి. గొట్టిముక్కల రిజర్వాయర్‌కు సంబంధించి రెండు పల్లెలు పూతలరామ తండా, లింగన్నబావి అనే 60, 70 ఇండ్లకు కుగ్రామాలు ఉన్నాయి. వాటికి ఆర్ అండ్ ఆర్ ప్రకటించకపోవడం వల్ల కనీసం వాగు నుంచి వచ్చే నీళ్లను కూడా ఆపుకోలేకపోవడం వల్ల మొత్తం ఆ మండలాల్లోని పదివేల ఎకరాలకు నీటికొరత ఏర్పడింది. కాబట్టి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతోపాటు సింగరాజుపల్లి రిజర్వాయర్‌లో సుమారు 10శాతం పనులు మిగిలిపోయి ఉన్నాయి. ఆ పనులు పూర్తి చేస్తే ఆ రిజర్వాయర్‌లో లోకల్ వాటర్ నింపుకోవడానికి ఉపయోగపడుతుంది. జి.ఓ.నెం. 123 ప్రకారం ల్యాండ్ అక్విజిషన్ కింద ఏ రైతులైతే తన కాన్‌సెంట్‌ను ఇచ్చారో వాళ్లకు ల్యాండ్ అక్విజిషన్ డబ్బులు పేమెంట్ జరగపోవడం వల్ల పనులలో పురోగతి లేదు. ఈ విషయాన్ని దయచేసి ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకొని పోయి సమస్య పరిష్కారం చేసి దేవరకొండ నియోజకవర్గ ప్రజలను ఆదుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కె.తారక రామారావు :- గౌరవ సభ్యులు రవీందర్ కుమార్‌గారు తన నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు అక్కడున్న భూసేకరణ, భూనిర్వాసితుల సమస్యల గురించి ప్రస్తావించిన అంశాలను నోట్ చేసుకున్నాము, పరిశీలిస్తాము.

శ్రీ దాసరి మనోహర్ రెడ్డి :- అధ్యక్షా, పెద్దపల్లి పట్టణం గౌరవ ముఖ్యమంత్రిగారి ఆశీస్సులతో మున్సిపాలిటీగా ఏర్పడి ఆ తరువాత జిల్లాకేంద్రంగా ఏర్పడింది. హెచ్‌కెఆర్ రోడ్ పెద్దపల్లి పట్టణానికి నాలుగు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నది. ఇటీవల గౌరవ మున్సిపల్‌శాఖ వారి చొరవతో హెచ్‌కెఆర్ రోడ్ నిర్వహిస్తున్న మేఘ ఇంజనీరింగు కంపెనీ వారు దానిని వైడెనింగ్ చేయడం జరిగింది. రోడ్డుకు రెండు పక్కల డ్రైనేజీ నిర్మాణం చేయాల్సి ఉన్నది. డ్రైనేజీ నిర్మాణం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి ముందు చిన్న వాగు వద్ద రోడ్డు బాగా డౌన్‌గా ఉండడం వల్ల ఈ మధ్యన కురిసిన వర్షాలకు ఒక రోజంతా రాకపోకలు ఆగిపోయాయి. అక్కడ రోడ్డు ఎత్తును పెంచినట్లయితే ఇబ్బంది లేకుండా ఉంటుంది. గౌరవ మంత్రిగారు మేఘ ఇంజనీరింగు కంపెనీ వారికి తగిన ఆదేశాలిచ్చి డ్రైనేజీ నిర్మాణం కొరకు రోడ్డు ఎత్తును పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ కె.తారక రామారావు :- అధ్యక్షా, పెద్దపల్లి శాసనసభ్యులు మనోహర్‌రెడ్డిగారు పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాష్ట్ర రహదారికి సంబంధించిన సమస్యను ప్రస్తావించారు. నోట్ చేసుకున్నాము, పరిశీలిస్తాము.

శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి :- అధ్యక్షా, ఇటీవల ఆగస్టులో కురిసిన భారీ వర్షాల వల్ల నర్సంపేట ప్రాంతంలో మరియు మా నియోజకవర్గం మొత్తంలో, గతంలో దాదాపు 28 సెంటీ మీటర్ల వర్షపాతం ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉన్నది. ఈసారి అందుకు చాలా ఎక్కువ రెట్లు వర్షపాతం అంటే, 135 సెంటీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఆగస్టులో కేవలం ఆరవ తేదీ నుండి ఇరవై ఏడవ తేదీ వరకు 135 సెంటీ మీటర్ల వర్షపాతం కురవడం వలన మా ప్రాంతానికి తీవ్రమైన నష్టం జరిగింది. ముఖ్యంగా పేదవాళ్ల గుడిసెలు కూలిపోవడం జరిగింది. అంతే కాకుండా రైతులు నాట్లు నాటే సమయంలో ఇంతటి భారీ నష్టం ఎప్పుడూ జరగలేదు. పంటలు వేసిన తరువాత మధ్య కాలంలో చాలా సార్లు నష్టం జరిగింది. వరి, కాటన్ మరియు అపరాల పంటలకు సంబంధించి ప్రారంభ దశలో ఈ విధంగా జరగడం అనేది ప్రప్రథమం. అందువలన ఆయా రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. రైతులకు మనో ధైర్యాన్ని అందించాల్సిన అవసరం ఉంది. రెండవ పంటకు సంబంధించి ప్రయత్నం చేద్దామనుకున్నాము. అనేక సంవత్సరాలుగా పోరాడినా గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి దయవల్ల రామప్ప నుంచి పాకాల ప్రాజెక్టు, రంగయ్యచెరువు ప్రాజెక్టులు మాకు రావడం జరిగింది.

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఆ ప్రాజెక్టు పూర్తి అయ్యింది. రెండవ పంటకు నీళ్లు అందించే దశలో ఉంది. మొదటి పంట పోయినప్పటికీ, రెండవ పంట అయినా పండించుకుందామని రైతులు ఆలోచిస్తున్నారు. కాబట్టి, ఆ ప్రాజెక్టులపై రెండవ పంటకు నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉందా, లేదా? ఈ పంటకు కూడా మద్ధతును రైతులకు ఇచ్చేపరిస్థితి ఉందా లేదా అనేది మీమాంసగా ఉన్నది. గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లమని మీ ద్వారా కోరుతున్నాను. చీఫ్ సెక్రటరీగారు కూడా ఈ విషయంలో అనేక నివేదికలు తెప్పించుకోవడం జరిగింది. 135 సెంటీ మీటర్ల వర్షపాతం అంటే దేశంలో ఇటీవల కురిసిన వర్షాలకు సంబంధించి అత్యధికంగా నమోదైన ఐదు ప్రాంతాల్లో ముఖ్యంగా నర్సంపేట ప్రాంతం నా సొంత మండలమైన నల్లబెల్లి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది.

మొన్నటి ఎండాకాలంలో చెరువులన్నీ జూన్ చివరి అంకంలో కూడా అంటే వానాకాలం ప్రారంభం కాక మునుపే మత్తళ్లు కురిపించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. ఆ సందర్భంగా చేపలు పట్టే వృత్తి గల మత్స్యకారులు చేపలు పట్టలేకుండా చెరువులు నిండుగా ఉండడంతో కొన్ని చేపలను వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. దానితో ఆ చేపలన్నీ వాగుల్లో కలిసిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఫిష్‌షీడ్‌ను కూడా ఇంకా వేయలేదు. ఫిష్‌షీడ్ విషయంలో 50 శాతం అదనంగా రూరల్ జిల్లాల్లో, మా ప్రాంతంలో ఎక్కువగా నష్టం జరిగింది. పాత వరంగల్ జిల్లాలో కూడా ఉంది. కాబట్టి, ఫిష్ షీడ్

విషయంలో కూడా అదనంగా పంపిణి చేసి వేలాది మత్స్య కారులను ఆదుకోవాలని కోరుకుంటున్నాను.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ :- గౌరవ సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గారు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

12.40 మ. **శ్రీ రేగా కాంతారావు** :- అధ్యక్షా, పినపాక నియోజక వర్గానికి సంబంధించి 9 పిహెచ్‌సిలు ఉన్నాయి. మాది చాలా మారుమూల ప్రాంతం. చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేయడానికి అక్కడి నుండి భద్రాచలం గాని, కొత్తగూడెం గాని తీసుకుని రావాలంటే చాలా దూర ప్రాంతమైపోయింది. వంద కిలోమీటర్లు పోవలసిన పరిస్థితి ఉంది. అలాగే ఆ ప్రాంత ప్రజలు వైద్యం చేయించుకోవాలంటే అత్యవసర పరిస్థితుల్లో మార్గమధ్యలోనే అనేకమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి ఉన్నది. వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి సుమారు 8 సంవత్సరాలు కావస్తోంది. కేవలం అక్కడ భవనం మాత్రమే ఉంది తప్ప, అందులో ఎటువంటి మౌలిక వసతులు గాని, సిబ్బంది గాని లేకపోవడం వల్ల ఆ ఆసుపత్రి నిరుపయోగంగా పడి ఉంది. అది ట్రైబల్ ఏరియా. అక్కడ నివసించే ప్రజలు సరైన వైద్య సదుపాయం లేక మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి అనేక రోగాల బారిన పడే అవకాశముంది. ఇది ట్రైబల్ ఏరియా కాబట్టి ఈ ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి వైద్య సేవలు అందించే విధంగా ఉపయోగంలోకి తీసుకుని రావాలని మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి :- గౌరవ శాసనసభ్యులు రేగా కాంతారావు గారు వారి పినపాక నియోజకవర్గంలోని వంద పడకల ఆసుపత్రిలో సిబ్బందిని నియమించే విషయమై ప్రస్తావించడం జరిగింది. నోట్ చేసుకున్నాం.

శ్రీ శానంపూడి సైదిరెడ్డి :- ధన్యవాదాలు అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన అంశం. పులిచింతల ప్రాజెక్టు పూర్తయింది. 45 టిఎంసిల నీటిని నిల్వ చేయడం జరుగుతోంది. ఆంధ్ర పాలకుల వివక్ష వల్ల తెలంగాణ ప్రాంతంలో ముఖ్యంగా మా నియోజకవర్గంలోని 13 మండలాలు ముంపునకు గురైనాయి. వారికి రావలసిన కూలీ వేతనాలు గాని, కటాఫ్ డేట్స్ 18 సంవత్సరాలు నిండిన వారికి ప్లాట్లు ఇవ్వడం గాని మరియు భూములకు ఇచ్చే నష్టపరిహార విషయంలో ఇలా అన్ని రకాలుగా వివక్షకు గురైనాం. ఆరోజు ఆంధ్రాకు ప్రాంతానికి చెందిన రైతులకు నష్టపరిహారం ఎక్కువ ఇచ్చి, మాకు తక్కువ ఇచ్చారు. అదీ కాకుండా ఇందిరమ్మ పథకం క్రింద దాదాపు 5,200 ఇళ్లకు గాను రూ.65 వేల చొప్పున ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. గత సంవత్సరం 13 గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించి 45 టిఎంసిల నీరు నిల్వ చేయడం జరిగింది. ఈ సంవత్సరం కూడా నిల్వ చేయడం జరిగింది. ఇంకా 200 ఎకరాలు అదనంగా ముంపునకు గురవుతున్నాయి. దానికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నాను.

ఇదేకాకుండా వజ్జేపల్లి అనే గ్రామంలో ఎస్సీ సోదరులందరూ చేపలు పట్టుకుని వాటినే జీవనాధారంగా నమ్ముకుని జీవిస్తున్నారు. వారు అడవిలో నివసిస్తారు. వారు ఉండటానికి ఇళ్లు లేదు. కరెంటు కూడా లేదు. వర్షం వస్తే ఉండే పరిస్థితి లేదు. అదే కాకుండా ప్రాజెక్టు క్రింది భాగంలో వజ్జేపల్లి, బుగ్గమాగారం అని రెండు గ్రామాలున్నాయి. ఆ రెండు గ్రామాలను ఆరోజు ముంపు క్రింద తీసుకోలేదు. దానివల్ల పోయిన సంవత్సరం రెండు వందల ఎకరాలు కొట్టుకుపోయాయి. ఈ సంవత్సరం కూడా రెండు వందల ఎకరాలు కొట్టుకుపోయాయి. ఇవే కాకుండా అదనంగా ముంపునకు గురైన రామచంద్రాపురం, రావిపాడు, మహంకాళిగూడెం వంటి గ్రామాలకు కూడా ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నాను. ఇంకా చెప్పాలంటే మా గ్రామం కూడా ముంపు గ్రామమే. కాబట్టి ఆ సమస్యల గురించి మాకు తెలుసు. చాలా సమస్యలు పెండింగులో ఉన్నాయి. మీద్వారా ముఖ్యమంత్రి గారికి ఒక రిప్రజంటేషన్ ఇస్తున్నాను. వీటి గురించి ఒక రోజు ప్రత్యేకంగా మీటింగు

ఏర్పాటు చేసి ఆ గ్రామాల నాయకులు, అధికారులను పిలిపించి పులిచింతల ముంపు గ్రామాల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను. ధన్యవాదాలు.

శ్రీ కె. తారక రామారావు :- హుజూర్‌నగర్ శాసనసభ్యులు సైదిరెడ్డి గారు పులిచింతలలోని ముంపు గ్రామాల సమస్యను ప్రస్తావించారు. వాటిని నోట్ చేసుకున్నాం. పరిశీలిస్తాం.

శ్రీ ఎ. జీవన్ రెడ్డి :- అధ్యక్షా, మా నియోజకవర్గం ఆర్మూరు. మా ఆర్మూరుకు పురాతన పేరు నవనాథ్‌పురం. అంతకుముందు మా దగ్గర క్షత్రీయులు, పట్కరీ వాళ్లు ఎక్కువగా ఉండేవారు. వారికి నవనాథ్‌పురం అనడం రాక దాన్ని ఆరుమూరుగా మార్చారు. కాలక్రమేణ ఆర్మూరుగా మారిపోయింది. అక్కడ నవనాథ్ సిద్దుల గుట్ట ఉంది. ఆ గుట్టకు వెళ్లడానికి చిన్న రోడ్డు ఉండేది. అక్కడ దేవాలయ కమిటీ వారు వారి సొంత నిధులు రూ.3 కోట్లతో ఆ రోడ్డును వెడల్పు చేయడం జరిగింది. అది తిరుపతి రోడ్డులాగా ఉంటుంది. ఆ రోడ్డు వెడల్పు దాదాపుగా 40 ఫీట్లు ఉంటుంది. దానిమీద స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి గారు రాష్ట్ర రైతు నాయకులుగా ఉండి అధ్యక్షులుగా పనిచేశారు. వారు స్వయాన గౌరవ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గారి తండ్రి. వారు ప్రతి సంవత్సరం ఆ గుడికి వస్తూ ఉండేది. ప్రతి శివరాత్రికి నవనాథ్ సిద్దుల గుట్టలోని దేవాలయాన్ని సందర్శించడానికి సుమారు లక్ష మంది భక్తులు వస్తుంటారు. ఉత్తర, దక్షిణ భారతదేశంలోనే పేరుగాంచిన దేవాలయం. దానికోసం ఇంతకుముందు నాలుగున్నర కోట్ల రూపాయలు మంజూరైనాయి. తర్వాత ల్యాప్స్ కూడా అయ్యాయి. దానికోసం నేను నాలుగున్నర సంవత్సరాలు ఉపవాసాలు కూడా చేశాను. మంత్రి గారి కులదైవం కాబట్టి ఈ సంవత్సరంలోనే రెండు, మూడు నెలల్లో ఆ రోడ్డును మంజూరు చేయవలసిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి :- గౌరవ శాసనసభ్యులు జీవన్‌రెడ్డి గారు వారి నియోజకవర్గంలోని సిద్దులగుట్టకు రోడ్డు విషయం గురించి ప్రస్తావించడం జరిగింది. తప్పకుండా దానిని పరిశీలించి గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి అది పూర్తయ్యే విధంగా చర్య తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

శ్రీ ఆత్రం సక్కు :- అధ్యక్షా, ఆసిఫాబాద్ నియోజకవర్గం పూర్తిగా అటవీ ప్రాంతం. కొండకోనలతో ఉన్న ఈ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడి రోడ్లు అధ్వాన్నంగా తయారైనాయి. గతంలో కూడా ఈ విషయం గురించి మంత్రిగారికి చెప్పడం జరిగింది. గుండి వాగుపై బ్రిడ్జీ నిర్మాణం, అలాగే ఉమ్రి, కరెన్జివాడ, కిసన్‌నాయక్ తండ, పర్సువాడ, అర్జుని, మారుగూడ వంటి గ్రామాలకు అసలు బ్రిడ్జీలే లేవు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గుండి గ్రామ ప్రజలు వాళ్ల పండుగకు సామాన్లు తీసుకురాలేని పరిస్థితుల్లో ఉంటే, నేను, గౌరవ ఛైర్మన్ గారు ఇద్దరం వెళ్లి అక్కడ ఉన్న మాజీ ఎంపిటిసితో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి, వాళ్లు సెంటర్‌కు వచ్చి సామాన్లు తీసుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విషయం గురించి గతంలో కూడా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులకు చెప్పడం జరిగింది. ఇంటర్‌స్టేట్‌కు సంబంధించి మహారాష్ట్రకు వెళ్లే గ్రామాలు అయిన పరందోలి, మొకదంగూడ, జూతికి వెళ్లడానికి సంబంధించి ఉమ్రి బ్రిడ్జీ నిర్మాణం పూర్తయితే మహారాష్ట్రతో కనెక్టివిటీ ఉంటుంది. కాబట్టి ఈ బ్రిడ్జీల నిర్మాణం సకాలంలో పూర్తి చేయవలసిందిగా కోరుతున్నాను. అలాగే అనేక గిరిజన గ్రామాలకు ఏ విధమైన రోడ్డు వసతి లేదు. కాబట్టి ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి :- గౌరవ శాసనసభ్యులు ఆత్రం సక్కుగారు వారి నియోజకవర్గంలోని బ్రిడ్జీలు మరియు రోడ్ల విషయం గురించి ప్రస్తావించారు. నోట్ చేసుకున్నాను.

శ్రీమతి అజ్మీరా రేఖ :- ధన్యవాదాలు అధ్యక్షా, మా నియోజకవర్గంలోని ప్రజలు కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో గౌరవ ముఖ్యమంత్రి గారు అక్కడికి వచ్చినప్పుడు మాట ఇవ్వడం జరిగింది. అది త్వరగా ప్రకటిస్తే బాగుంటుంది. ఎందుకంటే ఖానాపూర్ దగ్గర పెంబి, దసరాబాద్ రెండు మండలాలున్నాయి. నాలుగు మండలాల్లో రెండు మండలాలల్లో గిరిజనులు ఎక్కువగా ఉంటారు. అల్లంపల్లి, గంగాపూర్, ఖానాపూర్ నుంచి రావాలంటే దాదాపు 20 కిలోమీటర్ల వరకు ఉంటుంది. అక్కడి నుండి నిర్మల్ వెళ్లాలంటే 30 కిలోమీటర్లు. మొత్తం 50 కిలోమీటర్ల వరకు ఉంటుంది. కాబట్టి కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లయితే నేను, మా ప్రజలు రుణపడి ఉంటామని తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి తెలియజేస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి :- గౌరవ శాసనసభ్యురాలు రేఖా నాయక్ గారు వారి నియోజకవర్గంలోని కొత్త రెవెన్యూ డివిజన్ గురించి ప్రస్తావించారు. నోట్ చేసుకున్నాం.

శ్రీ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి :- ధన్యవాదాలు అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు దయతో జనగామను జిల్లాగా చేసిన తర్వాత దాని ఆకృతి, ఎల్లలు పెరుగుతున్నాయి. తూర్పు భాగం బైపాస్ రోడ్డు రెడీ అయింది. అలాగే పశ్చిమభాగం డిపిఆర్ కూడా చేయడం జరిగింది. కర్ణాటక, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించిన హెవీ వెహికిల్స్ ఆ టౌన్ గుండా వెళతాయి. కాబట్టి రింగురోడ్డుకు పశ్చిమ భాగంలో విశాలమైన మరొక రోడ్డును ఏర్పాటు చేసినట్లయితే జనగామ పట్టణం బాగా అభివృద్ధి చెందుతుంది.

అలాగే సిద్దిపేట నుండి సూర్యాపేట వెళ్లే రోడ్డు మరియు హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే రోడ్డు గుంతలు పడి చాలా అధ్వాన్నంగా మారాయి. నేను ఆ దారిలో వెళుతున్నప్పుడు ఒక గర్భిణీ స్త్రీ పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుంటే చూసి వెంటనే ఆమెను ఆసుపత్రిలో అడ్మిట్ చేయడం జరిగింది. అదే దారిలో ఒక వృద్ధుడు కింద పడితే, తలకు గాయమైంది. మొన్న వర్షాలకు రంగప్ప చెరువు నిండి, ఆ నీళ్లు రోడ్డు మీదికి రావడం చేత ఆ రోడ్డు పూర్తిగా పాడై పోయింది. ఆ దారిలో వెళుతున్న ముగ్గురు యువకులు కూడా మోటార్ సైకిల్‌పై నుంచి క్రింద పడటం వల్ల వారికి ఫ్రాక్చర్ అయింది. కాబట్టి తక్షణమే ఆ రోడ్డు మరమత్తుల కొరకు నిధులు మంజూరు చేయాలని మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. అలాగే రింగ్‌రోడ్డు మాస్టర్‌ప్లాన్‌లో ఇంక్లూడ్ కాలేదు. రింగ్‌రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో ఇంక్లూడ్ చేసి, తక్షణమే మాస్టర్ ప్లాన్ విడుదల చేస్తే జనగాం పట్టణం బాగా అభివృద్ధి చెందుతుందని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్ష, గౌరవ సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గారు ప్రస్తావించిన మాస్టర్ ప్లాన్ మరియు రహదారుల పరిస్థితుల గురించి చెప్పిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. పరిశీలిస్తాము.

12.50 మ. **శ్రీ మల్లు భట్టి విక్రమార్క** :- అధ్యక్ష, మా శాసనసభ నియోజకవర్గం మధిరలో మున్నేరు నదీపైన 2013-14వ సంవత్సరంలో మొదలుపెట్టిన ఆనకట్టని గత ఆరు సంవత్సరాల నుంచి పనులు చేయనీయకుండా బిల్స్ పెండింగ్‌లో ఉంచారు. మున్నేరు నది నీళ్లని కుడి, ఎడమ కెనాల్ ద్వారా రెండు మండలాలకి సాగు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంది. దానిని పూర్తి చేయకపోవడం వలన మున్నేరు ప్రతి సంవత్సరం వచ్చే వరదతో వృధాగా క్రిందికి ప్రవహించి కృష్ణా జిల్లా గుండా సముద్రంలోకి కలుస్తోంది. కాబట్టి, తెలంగాణ ప్రభుత్వాన్ని కోరేదేమంటే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సాధ్యమైనంత వరకు ఉన్న నదులపైన వృధాగా ప్రవహిస్తున్న నీళ్లకు ఆనకట్టుకుందామని అనుకున్నామో, ఆల్రెడీ మొదలు పెట్టి ముందుకుపోతున్న ప్రాజెక్టులు ఇటువంటివాటిని ఆపకుండా సాధ్యమైనంత వరకు వాటిని పూర్తి చేస్తే మనం సాధించుకున్న రాష్ట్రానికి కొంత

న్యాయం చేసిన వారమవుతాము. దయచేసి ప్రభుత్వం ఇలా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను గుర్తించి వెంటనే నిధులు కేటాయించి పనులు జరిగే విధంగా చూడవల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్ష, సభ్యులు మల్లు భట్టి విక్రమార్క ప్రస్తావించిన మధిర నియోజకవర్గంలోని మున్నేరులో ఆనకట్ట గురించి ప్రస్తావించిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. పరిశీలిస్తాము.

(JANAB T.RAJA SINGH, GOSHAMAHAL CONSTITUENCY) جناب ٹی راجا سنگھ

شکریہ اسپیکر صاحب! پچھلے چودہ سال سے یادو اہیر سماج کے افراد ایکسٹریم بیکورڈ کلاس میں شمولیت کے لئے کافی جدوجہد کررہے تھے۔ آج میں ہمارے سی ایم صاحب، ہمارے بی سی ویلفیئر منسٹر صاحب، کے ٹی آر صاحب وغیرہ کا شکریہ ادا کرتا ہوں جنہوں نے یادو اہیر سماج کو بی سی۔ڈی گروپ میں شمولیت کے لئے راہ ہموار کی۔ مجھے جب بھی اسمبلی میں بولنے کا موقع ملتا تھا تو میں میرے حلقہ اسمبلی کے ان سماجوں کے بارے میں بولنے کی ہمت کرتا تھا اور ان کے جو بھی مسائل ہیں، ان کو آپ کے سامنے رکھنے کی کوشش کرتا تھا۔ لیکن سی ایم صاحب نے فرش دل سے کہا کہ ہاں یادو اہیر سماج کو میں اچھی طرح جانتا اور پہچانتا ہوں جن کے نام سے ہی گولی گوڑ کو موسوم کیا گیا ہے۔ یہ بات سی ایم صاحب نے بی سی ویلفیئر کی میٹنگ میں خود کہا تھا۔ اس وقت سی ایم صاحب کی یہ بات سن کر بہت خوشی ہوئی تھی۔ اس وقت کیشو راؤ صاحب نے کہا تھا کہ یادو اہیر سماج کے افراد کئی سالوں سے جدوجہد کررہے ہیں، اس لئے ان کو ایکسٹریم بیکورڈ کلاس میں شامل کرنا بہت ضروری ہے کیونکہ تلنگانہ میں یہ ایک بہت بڑا سماج ہے۔ تو میں ہمارے سی ایم صاحب اور منسٹر صاحب کا دل سے شکریہ ادا کرتا ہوں۔ اس کے ساتھ ہی ساتھ کل جاری کئے گئے جی او میں تھوڑی سی تبدیلی لانے کی ضرورت ہے جس میں یادو اہیر سماج کے بجائے اہیر یادو سماج ذکر کیا گیا ہے۔ تو میں ہمارے منسٹر صاحب سے یہ کہنا چاہتا ہوں کہ کل میں آپ کو اس سلسلہ میں ایک مکتوب دوں گا۔ اگر اس جی او میں اس کی تصحیح ہوجائے تو اس سماج کے نوجوانوں کے لئے وہ کافی معاون ثابت ہوگا۔ شکریہ۔

శ్రీ గంగుల కమలాకర్ :- అధ్యక్ష, కులవృత్తి మీద ఆధారపడ్డ నిరుపేదల వారి చిరకాల వాంఛ, వారిని బిసి కులంలో కలుపాలి, ఒసి సర్టిఫికెట్‌తో మాకు ఇబ్బందౌవుతుందని గౌరవ ముఖ్యమంత్రిగారిని విన్నవించుకోవడం వల్ల, సుమారు 72 సంవత్సరాల డిమాండ్‌ను గౌరవ ముఖ్యమంత్రిగారు న్యాయం చేశారు. 17కులాలను బిసిలుగా పరిగణిస్తున్నట్లు నిన్ననే జీవో విడుదల చేయడం జరిగింది. దీని ద్వారా వెనకబడిన కులాల పక్షాన గౌరవ ముఖ్యమంత్రిగారికి ఉన్న కృతజ్ఞత తెలుస్తోంది. అయిన గౌరవ సభ్యులు రాజాసింగ్ గారు కొన్ని సవరణలు చేయమని చెప్పారు, కొన్ని కులవృత్తులు చెప్పుకోలేని విధంగా ఉన్నాయి కాబట్టి, వారి పేరు కూడా సవరణ చేయమని చెప్పారు. సంబంధిత విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటాము.

శ్రీ డా. ఎం. ఆనంద్ :- అధ్యక్ష, నా ప్రశ్న గౌరవ పురపాలక శాఖామాత్యుల వారికి సంబంధించినది. గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి పుణ్యమా అని మిషన్ కాకతీయ పథకం ద్వారా మన రాష్ట్రంలోని చాలా చెరువులు కళకళలాడుతున్నాయి. మా వికారాబాద్ నియోజకవర్గంలో కోటేపల్లి ప్రాజెక్టు, సర్వన్ ప్రాజెక్టు నీటితో అలుగువెళ్లి పారుతున్నాయి. కాకాపోతే వికారాబాద్ మున్సిపాలిటీలోని శివారెడ్డిపేట్ చెరువు మాత్రం ఇప్పటివరకు సగం కూడా నిండలేదు. ఆ చెరువు వికారాబాద్ ప్రాంత వాసుల నీటి అవసరాలను తీర్చినటువంటిది. కానీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సగం కూడా నిండలేదు కాబట్టి, 179 ఎకరాలు ఉన్న చెరువు ప్రస్తుతం ఎన్ని ఎకరాలు ఉంది? దాని ఫీడింగ్ చానల్స్ ఏమైనా బ్లాక్ అయ్యాయా? అక్రమణలు ఎమైనా జరిగాయా? అనే వాటిని పూర్తి విచారణ చేసి, దానికి పూర్వవైభవం తీసుకురావలని తమరి ద్వారా గౌరవ మున్సిపల్ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు :- అధ్యక్ష, సభ్యులు డా. ఆనంద్ గారు ప్రస్తావించిన వికారాబాద్ శివారెడ్డిపేట చెరువు సమస్యలను ప్రస్తావించారు. నోట్ చేసుకోవడం జరిగింది. పరిశీలిస్తాము.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి :- అధ్యక్ష, నా ప్రశ్న గౌరవ పురపాలక శాఖామాత్యుల వారికి సంబంధించినది. గతంలో కూడా నేను కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల గురించి మాట్లాడడం జరిగింది. మున్సిపాలిటీలను ఏర్పాటు చేసుకున్నామని సంతోషపడుతున్నాము. ఉదాహరణకు

చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఇండస్ట్రీయల్ పార్కు ఉందని చాలా మంది ప్రజలు ఇక్కడికి వచ్చి స్థిర పడుతున్నారు. మొత్తం మున్సిపల్ ఏరియా లిమిట్స్‌కు సంబంధించి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి, ఒక పద్ధతి ప్రకారం మనం అభివృద్ధి చేసుకోవాలి. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ నెట్‌వర్క్ ఎన్నో రకాల సమస్యలు మున్సిపాలిటీల్లో ఉన్నాయి. కొత్త మున్సిపాలిటీలు ఏర్పడిన తరువాత నిధులు వస్తాయని, అభివృద్ధి చెందుతుందని ప్రజలు అనుకుంటున్నారు. మొన్న వర్షాకాలంలో వర్షపు నీటితో మున్సిపాలిటీ నీళ్లు కలిసి ఇండ్ల మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. కనీసం ఆ నీళ్లు వెళ్లే పరిస్థితి గాని, ఇంకే పరిస్థితి గాని లేదు. డ్రైనేజీ వ్యవస్థ లేదు, రోడ్లు లేవు. చౌటుప్పల్‌లాంటి ఏరియాలో బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంటులు కూడా నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంటుకు పర్మిషన్ ఇచ్చినప్పుడు, జనసాంద్రత పెరుగుతున్నప్పుడు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకపోతే మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకొని కూడా ప్రయోజనం లేదు. చౌటుప్పల్, చండూరు రెండు మున్సిపాలిటీలు మునుగోడు నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైనవి. చండూరు మున్సిపాలిటీలో నేను ఎన్నికల సందర్భంలో తిరిగినప్పుడు ఇక్కడ ప్రజలు ఎలా ఉంటున్నారు, ఇది మనుషులు ఉండగలిగే ప్రదేశమేనా అనే విధంగా ఉన్నాయి.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగింది కాబట్టే, కాంగ్రెస్ పార్టీ హైదరాబాదుతో కూడిన తెలంగాణను మిగులు బడ్జెట్‌తో ఇచ్చింది. రాష్ట్రం ఏర్పాటై ఆరు సంవత్సరాలైంది. మేము అద్భుతాలు సృష్టిస్తామని చెప్పి, మనకు సాధ్యం కాని మాటలు చెప్పి ప్రజలను భ్రమలో పెట్టవద్దని చెబుతున్నాను. మీరు చేయగలిగినవే చెప్పండి. తమరి ద్వారా గౌరవ మున్సిపల్ మంత్రిగారిని రిక్వెస్ట్ చేసేదేమంటే, చౌటుప్పల్‌కు వంద కోట్ల రూపాయలు ఇవ్వమని, సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ లాగా చేయమని అడగడం లేదు. కనీసం మా వైపుకూడా ఓ కన్నెత్తి చూడండి. ఈ రాష్ట్రంలో ఒక్క సిద్ధిపేట, సిరిసిల్ల మాత్రమే అభివృద్ధి చెందితే సరిపోదు. ఎన్నో మున్సిపాలిటీలు, ఎన్నో నియోజకవర్గాలు ఉన్నాయి, మేము కూడా తెలంగాణలోనే ఉన్నాము అన్న విషయాన్ని ...

మిస్టర్ డెప్యూటి స్పీకర్ :- ఇది జీరో అవర్ క్వశ్చన్ అడగండి, ప్లీజ్.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి :- అధ్యక్ష, అధికార పార్టీ సభ్యులను అందుకే మధ్యలో మాట్లాడవద్దని కోరుతున్నాను. నేను ముఖ్యమంత్రి గారిని, ప్రభుత్వాన్ని, మంత్రి వర్గాన్ని ఏమీ అడగడం లేదు. ఒకసారి మంత్రి గారిని రమ్మని ఆహ్వానిస్తున్నాను. మాకు వందల కోట్లు వద్దు. కనీసం డ్రెయినేజ్ వాటర్ నిలవకుండా చేస్తూ, సిసి రోడ్లు ఏర్పాటు చేసి అక్కడ ప్రజలు ఉండే విధంగా చేయాలని కోరుతున్నాను. ఇప్పుడు కరోనా సమస్య ఉంది. కరోనా వల్ల రాష్ట్ర ఆదాయం తగ్గిపోయి చాలా ఇబ్బందులున్నాయి. మేమేమీ విషయాలు తెలియని వాళ్లం కాదు. ముఖ్యమంత్రి గారు ఒక మాట అన్నారు. అపోజిషన్‌లో ఉండి మీరు మంచి సూచనలు ఇవ్వండి, ప్రభుత్వాన్ని టార్గెట్ చేయవద్దని అన్నారు. మేము ప్రభుత్వాన్ని టార్గెట్ చేయదలుచుకోలేదు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి రూ.20 కోట్లు శాంక్షన్ అయ్యాయి, రెండు సంవత్సరాల నుంచి పేపర్ మీదే ఉన్నాయి. చండూరు మున్సిపాలిటీకి రూ.10 కోట్లు శాంక్షన్ అయ్యాయి. టోటల్ ఎస్టిమేషన్స్ తయారు చేసి పంపించాం. మంజూరైన రెండు సంవత్సరాల తర్వాత చివరికి ఒక నెల క్రింద మాకు తెలిసిందేమంటే, ఫండ్స్ ల్యాప్స్ అయిపోయాయి, ఫండ్స్ లేవని చెబుతున్నారు. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటైన తర్వాత మీరు ఒక్కనయా పైసా కూడా ఖర్చు పెట్టలేదు కాబట్టి డ్రెయినేజి పనులకు, సిసి రోడ్ల నిర్మాణానికి ఫండ్స్ రిలీజ్ చేసి డెవలప్‌మెంటుకి సహకరించవలసిందిగా మీద్వారా మున్సిపల్ శాఖా మంత్రి కేటిఆర్ గారిని కోరుతున్నాను.

1.00 మ. **శ్రీ కె.తారక రామారావు**:- అధ్యక్షా, గౌరవ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ, చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీలకు సంబంధించిన

విషయాలను ప్రస్తావించారు. వారిని ఒకటి గమనించమని కోరుతున్నాను. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టణ ప్రగతి కార్యక్రమం క్రింద ప్రతినెలా ఠంచన్‌గా రూ.148 కోట్లు మున్సిపాలిటీలకు విడుదల చేస్తున్నాం. గౌరవ సభ్యులు ఈ విషయాన్ని తెలుసుకోవాలని కోరుతున్నాను. రెండు – ఈ ప్రభుత్వం వచ్చి ఆరు సంవత్సరాలు పూర్తయి ఏడో సంవత్సరంలో అడుగుపెట్టింది. వారు చెప్పినట్లుగా నిజంగానే మేము పని చేయకపోయి ఉంటే, మొన్న 130 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే 122 మున్సిపాలిటీలలో టిఆర్ఎస్ పార్టీ గెలిచిదేనా? ప్రజలు మీరు చెప్పేది విన్నారు, మేము చెప్పేది వింటున్నారు. కాబట్టి సత్యదూరమైన మాటలు చెప్పడం మానేసి కొంత వాస్తవికంగా మాట్లాడితే ప్రజలు కూడా హర్షిస్తారు తప్ప మీకు జీరో అవర్లో మైకు ఇచ్చినా హీరోగిరి చేస్తామంటే అది మంచి పద్ధతి కాదని వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కాలె యాదయ్య :- అధ్యక్షా, నా చేవెళ్ల నియోజకవర్గంలో 80 గ్రామాలకు జీ.ఓ.నెం.111 గుదిబండ లాంటి సమస్యగా ఉంది. ఈ గ్రామాలలో చాలా మంది పేద రైతులున్నారు, రెండెకరాల పొలం ఉన్న రైతులు కూడా ఉన్నారు. బిడ్డ పెళ్లికో, కొడుకు పెళ్లికో డబ్బులు అవసరమై పొలం అమ్ముకుందామంటే వాళ్లకు పర్మిషన్ లేదు. గతంలో జంట జలాశయాల నుంచి హైదరాబాదు, సికింద్రాబాదు జంట నగరాలకు త్రాగు నీటి సరఫరా జరిగేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంటింటికీ త్రాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తున్నారు. కాబట్టి ఆ జంట జలాశయాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా వాటిని కాపాడుకుంటూనే, 80 గ్రామాలలో ఉండే పేద రైతులను దృష్టిలో పెట్టుకొని జీ.ఓ. నెం.111 ను ఎత్తేయాలి, లేకపోతే సడలించాలి. ఈ మధ్య కొంత మంది రైతులు తమ భూములు అమ్ముకుంటున్నా వాటికి రిజిస్ట్రేషన్స్ కావడం లేదు. కాబట్టి జీ.ఓ. నెం.111 రద్దు చేయండి. ఈ జీ.ఓ. పరిధిలో ఉండే ప్రాంతంలో భూములు/ప్లాట్లు కొన్న వాళ్లకు ఇటీవల ప్రకటించిన ఎల్.ఆర్.ఎస్. స్కీములో రెగ్యులరైజ్ చేసుకోవడానికి పర్మిషన్స్ ఇచ్చేలా చూడాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.తారక రామారావు :- అధ్యక్షా, గౌరవ చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య గారు మాట్లాడుతూ, జీ.ఓ.నెం.111 ను రద్దుచేయడం లేదా సడలించే విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం ఆ విషయాన్ని నోట్ చేసుకుంది, పరిశీలిస్తాం.

MR. DEPUTY SPEAKER:- Now, the House is adjourned to meet at 10.00 a.m. tomorrow i.e. 11th September, 2020.

(The House then adjourned at 1.05 p.m. to meet again at 10.00 a.m. on 11th September, 2020.)

***

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."